మా అక్షరాలు - నిజాల నిప్పుకణికలు

# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

సంపుటి : 5 పేజీలు - 8
సంచిక : 208వ వెల - రూ 5:00

Email: prajamantalu@gmail.com www.prajamantalu.com ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnag
Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yad




# తెలంగాణ బిడ్డలను అంతర్జాతీయ క్రీడాకారులుగా తయారు చేయాలి

## రాష్ట్రానికి గుర్తింపు తెచ్చేలా కొత్త స్పోర్ట్స్ పాలసీని తయారు చేయాలి : సీఎం రేవంత్

హైదరాబాద్, (ప్రజా మంటలు): అద్భుతమైన క్రీడాకారులను తీర్చిదిద్దటంతో పాటు అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణకు గుర్తింపు తెచ్చేలా కొత్త స్పోర్ట్స్ పాలసీని తయారు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. 2036 ఒలింపిక్స్ ను దృష్టిలో పెట్టుకొని కొత్త పాలసీలో లక్ష్యాలను నిర్దేశించుకోవాలని చెప్పారు. అధికారులు తయారు చేసిన కొత్త స్పోర్ట్ పాలసీ ముసాయిదాపై ముఖ్యమంత్రి శుక్రవారం సచివాలయంలో అధికారులతో సమావేశమయ్యారు. ముఖ్యమంత్రితో పాటు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు కె.కేశవరావు, జితేందర్ రెడ్డి, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనారెడ్డి, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, క్రీడలు, యువజన అభ్యున్నతి శాఖ ముఖ్య కార్యదర్శి వాణి ప్రసాద్, సీఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎం కార్యదర్శి షానవాజ్ ఖాసీం ఈ సమావేశంలో పాల్గొన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు వివిధ దేశాలు, ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్న విధానాలను ప్రధానంగా చర్చించారు. వివిధ ఆటల్లో ప్రతిభ ఉన్న యువతను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడే క్రీడాకారులుగా తీర్చిదిద్దాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పంగా ఎంచుకుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ లక్ష్యాన్ని నెరవేర్చేందుకు అనుసరించాల్సిన అత్యుత్తమ విధానాలను క్రీడా పాలసీలో పొందుపరచాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా నెలకొల్పనున్న స్పోర్ట్స్ యూనివర్సిటీని యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి సూచించారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ తరహాలోనే స్పోర్ట్స్ యూనివర్సిటీని పీపీపీ మోడల్లో నిర్వహించాలన్నారు. ప్రత్యేకంగా బోర్డు ఏర్పాటు చేసి ఛైర్మన్ను నియమించాలని, యూనివర్సిటీకి స్వయం ప్రతిపత్తి ఉండేలా బాధ్యతలు అప్పగించాలని సూచించారు. స్పోర్ట్స్ యూనివర్సిటీలో దాదాపు 13 కోర్సులు నిర్వహించాలని ప్రాథమికంగా నిర్ణయించారు. క్రికెట్, హాకీ, ఫుట్బాల్, బాస్కెట్ బాల్, స్విమ్మింగ్, టెన్నిస్, బ్యాడ్మింటన్, షూటింగ్, బాక్సింగ్, రెజ్లింగ్, టేబుల్ టెన్నిస్, అథ్లెటిక్స్, జిమ్నాస్టిక్స్, అక్వాటిక్స్ లాంటి 14 క్రీడలను స్పోర్ట్స్ హబ్ లో పొందుపరిచారు. గచ్చిబౌలి స్పోర్ట్స్ స్టేడియం ప్రాంగణంలో స్పోర్ట్స్ యూనివర్సిటీని ప్రారంభించాలని చెప్పారు. దాదాపు 70 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ ప్రాంగణంలో ఇప్పటికే వివిధ క్రీడలకు రెడీమేడ్ సదుపాయాలున్నాయని, భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా వాటిని అధునాతనంగా అప్ గ్రేడ్ చేసుకోవాలని సూచించారు. హైదరాబాద్లో ఇప్పటికే అందుబాటులో ఉన్న ప్రముఖ క్రీడా మైదానాలు, స్టేడియంలు అన్నింటినీ స్పోర్ట్ హబ్ పరిధిలోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఎల్బీ స్టేడియం, హకీంపేట స్పోర్ట్స్ స్కూల్, కోట్ల విజయ భాస్కరరెడ్డి ఇండోర్ స్టేడియం, సరూర్ నగర్ ఇండోర్ స్టేడియం, యూనివర్సిటీ సైక్లింగ్ వెలోడ్రమ్ లాంటివన్నింటినీ గుర్తించి.. ఒకే గొడుగు కిందకి తీసుకురావాలని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ క్రీడల్లో



ప్రతిభావంతులను గుర్తించటం నుంచి వారికి చదువులకు ఆటంకం లేకుండా.. అటు జాతీయ స్థాయి, అంతర్జాతీయ స్థాయి పోటీలకు అవసరమైన ప్రావీణ్యం నేర్పించే క్రమంలో ఎదురయ్యే ఆటుపోట్లన్నీ పరిష్కరించేలా కొత్త పాలసీ ఉండాలని ముఖ్యమంత్రి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. మన ప్రాంతంలో ఉన్న భౌగోళిక పరిస్థితులతో పాటు.. మన ప్రాంత యువతకు ఆసక్తి ఉన్న క్రీడలకే ప్రాధాన్యమివ్వాలని అప్రమత్తం చేశారు. దేశ విదేశాల్లో ఉన్న కోచ్లను రప్పించాలని, అక్కడున్న యూనివర్సిటీల సహకారం తీసుకునేలా ఎంవోయూలు చేసుకోవాలని చెప్పారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన క్రీడాకారులకు ఇచ్చే ప్రోత్సాహకాలకు స్పష్టమైన విధానాన్ని అనుసరించాలని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ఏ స్థాయి పోటీల్లో


మిగతా 2లో..


# తిరుపతి లడ్డూపై సుప్రీం స్వతంత్ర సిట్

- కల్తీ ఎలా జరిగిందో తెలియాలి
- ఐదుగురు సభ్యులతో కూడిన దర్యాప్తు టీంను ఏర్పాటు చేయండి
- ధర్మాసనం కీలక నిర్ణయం - తీర్పును స్వాగతించిన సీఎం చంద్రబాబు



అమరావతి (ప్రజా మంటలు): తిరుమల శ్రీవారి లడ్డు విషయంలో సుప్రీంకోర్టు మరోసారి సంచలన వ్యాఖ్యలు చేయడమే కాకుండా కీలక ఆదేశాలు జారీ చేసింది. తిరుమల శ్రీవారి లడ్డు విషయంలో శుక్రవారం సుప్రీంకోర్టు విచారణ జరిపింది. ఈ సందర్భంగా దాదాపు రెండు గంటల పాటు విచారణ జరిగింది. అనంతరం సుప్రీంకోర్టు లడ్డు విషయంలో కీలక ఆదేశాలు జారీ చేసింది. తిరుమల శ్రీవారి లడ్డు కల్తీ వ్యవహారంలో నిజానిజాలు తేల్చేందుకుగాను... స్వతంత్ర దర్యాప్తు టీం ను ఏర్పాటు చేయాలని.. స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. ఐదుగురు సభ్యులతో కూడిన సిట్ ను ఏర్పాటుచేసి... తిరుమల శ్రీవారి లడ్డు కల్తీ విషయంలో ఆధారాలను.. వెలికి తీయాలని స్పష్టం చేసింది. ఐదుగురు సభ్యులలో... ఇద్దరు సిబిఐ ఆఫీసర్లు ఉండాలని పేర్కొంది. అలాగే సిట్ నుంచి అంటే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ఇద్దరు అధికారాలు ఉండాలని తెలిపింది. ఎఫ్ ఎస్ ఎస్ ఏ ఐ నుంచి కూడా ఒక నిపుణులు కచ్చితంగా ఉండాలని పేర్కొంది. మొత్తం ఐదుగురు సభ్యులతో ఈ సిట్ ఏర్పాటు కావాలని.. సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. ఇక ఈ విచారణ సిబిఐ డైరెక్టర్ పర్యవేక్షణలో.. మాత్రమే జరగాలని తెలిపింది. ఈ సిట్ విషయంలో ఎవరు జోక్యం చేసుకోకూడదు అని స్పష్టమైన వ్యాఖ్యలు చేసింది. ఈ తిరుమల శ్రీవారి వ్యవహారం పొలిటికల్ డ్రామాగా మారాలని... తమ కోరుకోవడం లేదని సుప్రీంకోర్టు


మిగతా 2లో..


## పేదల గుండెల్లో..పూరీ గుడిసెల్లో.. దీపమై వెలిగిన కాకా..

### - ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్, (ప్రజా మంటలు): పేద ప్రజల హృదయాలలో దీపమై వెలిగిన మహనీయుడు కాకా (జి. వెంకటస్వామి) అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. శనివారం వెంకటస్వామి జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి అయన చేసిన సేవలను స్మరించుకున్నారు. ఎమ్మెల్యే గా, ఎంపీ గా కేంద్రమంత్రిగా, సేవలందించారని, సింగరేణి కార్మికుల జీవితాల్లో చెరగని ముద్ర వేసుకున్నారని, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం నిర్విరామంగా కృషి చేసారని ముఖ్యమంత్రి అన్నారు. తెలంగాణ తొలిదశ, మలి దశ ఉద్యమాల్లో కాకా అలుపెరుగని పోరాటం చేసారని, 1969లో తెలంగాణ కోసం జైలు కెళ్లాడని సీఎం అన్నారు. అయన జీవితం కార్మికులు, పేదలతోనే మమేకమైందని, నిలువ నీడ లేని నిరుపేదలకు గూడు కల్పించాలని గుడిసెల పోరాటం చేసి, కొన్ని వేల గుడిసెలు పేదలకోసం వేయించారని సీఎం కొనియాడారు.

● దద్దరిల్లిన దండకారణ్యం

# భారీ ఎన్కౌంటర్

## 30 మంది నక్సల్స్ మృతి



- నెత్తురోడిన దండకారణ్యం
- దంతెవాడజిల్లాలో భారీ ఎన్కౌంటర్
- 30 మంది మావోయిస్టుల మృతి

దంతెవాడ (ప్రజా మంటలు): ఛత్తీస్గఢ్ దండకారణ్యంలో మరోసారి తుపాకీల మోత మోగింది. నారాయణ్పుర్- దంతెవాడ జిల్లాల సరిహద్దుల్లో జరిగిన భారీ ఎన్కౌంటర్ లో మావోయిస్టులకు కోలుకోలేని దెబ్బ తగిలింది. ఈ ఎదురుకాల్పుల్లో ఇప్పటివరకు మృతి చెందిన మావోయిస్టుల సంఖ్య 30కి చేరినట్లు పోలీసులు వెల్లడించారు. ప్రస్తుతం ఎదురు కాల్పులు కొనసాగుతున్నట్లు సమాచారం. బస్తర్ రేంజ్లోని దంతెవాడ- నారాయణ్పుర్ జిల్లాల సరిహద్దుల్లో ఉండే అబూజ్మాడ్ దండకారణ్యంలోని తుల్తులి, నెందూర్ గ్రామాల మధ్య శుక్రవారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో ఎదురు కాల్పులు చోటుచేసుకున్నట్లు బస్తర్ రేంజ్ ఐజీ సుందర్ రాజ్ మీడియాకు తెలిపారు. అక్కడ మావోయిస్టులు నక్కి ఉన్నారన్న సమాచారంతో చేపట్టిన ఆపరేషన్లో డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్ (డీఆర్జీ), స్పెషల్ టాస్క్ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నట్లు పేర్కొన్నారు. ఈ ఎన్కౌంటర్ అనంతరం 30మంది మావోయిస్టుల మృతదేహాలతో పాటు ఏకే 47 రైఫిల్, ఇతర ఆయుధాలు స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటికీ ఆ ప్రాంతంలో అడపాదడపా ఎదురు కాల్పులు


మిగతా 2లో..


# జర్నలిస్టులపై క్రిమినల్ కేసులు పెట్టొద్దు

- ఇది భావాప్రకటన స్వేచ్ఛకు విఘాతం
- రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీం ఆదేశాలు



న్యూఢిల్లీ, (ప్రజా మంటలు): ప్రభుత్వంపై విమర్శనాత్మక కథనాలు రాసినంత మాత్రన జర్నలిస్టులపై క్రిమినల్ కేసులు పెట్టడం సరికాదని భారత సర్వోన్నత న్యాయస్థానం అభిప్రాయ పడింది. అలా చేస్తే భావ ప్రకటనా స్వేచ్ఛకు విఘాతం కలిగించినట్లే అవుతుందని స్పష్టం చేసింది. తనపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్ను కొట్టివేయాలని కోరుతూ ఓ జర్నలిస్టు వేసిన పిటిషన్ విచారణ సందర్భంగా సుప్రీం కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. ఈ కేసులో ఎటువంటి బలవంతపు చర్యలు తీసుకోకుండా మధ్యంతర రక్షణ కల్పించింది. ప్రభుత్వ పాలనా విభాగంలో కుల సమీకరణాలకు సంబంధించి ఉత్తర్ప్రదేశ్కు చెందిన అభిషేక్ ఉపాధ్యాయ్ ఓ కథనం రాశారు. దీనిపై యూపీ పోలీసులతో పాటు వివిధ ప్రాంతాల్లో కేసులు నమోదయ్యాయి. దీనిని కొట్టివేయాలని కోరుతూ అభిషేక్ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్ను విచారించిన జస్టిస్ హృషికేశ్ రాయ్, జస్టిస్ ఎస్వీఎన్ భట్టీలతో కూడిన ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. "ప్రజాస్వామ్య దేశాల్లో భావవ్యక్తీకరణ స్వేచ్ఛను గౌరవించాలి. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(ఏ) ప్రకారం జర్నలిస్టుల హక్కులకు రక్షణ ఉంటుంది. కేవలం జర్నలిస్టులు రాసిన కథనాలను విమర్శలుగా భావించి, వారిపై క్రిమినల్ కేసులు పెట్టకూడదు" అని సుప్రీం ధర్మాసనం పేర్కొంది. ఈ క్రమంలో ఉత్తర్ప్రదేశ్ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసిన న్యాయస్థానం.. తదుపరి విచారణ నవంబర్ 5కు వాయిదా వేసింది.

## ప్రజా నాడి







# గ్రూప్-1 నోటిఫికేషన్పై హైకోర్టులో తీర్పు రిజర్వు

హైదరాబాద్, (ప్రజా మంటలు): గ్రూప్-1 నోటిఫికేషన్పై హైకోర్టులో విచారణ ముగిసింది. తీర్పును రిజర్వు చేస్తున్నట్టు ధర్మాసనం తెలిపింది. గ్రూప్-1 పరీక్షల కీపై అభ్యంతరాలు స్వీకరించామని, వాటిని ఆయా సబ్జెక్ట్ల వారీగా నిపుణుల కమిటీకి పంపి..వారు ఆమోదించిన తర్వాతే ఫలితాలు విడుదల చేసినట్లు టీజీపీఎస్సీ (ంఉఖూఅ) హైకోర్టుకు గురువారం నివేదించింది. త్వరలో మెయిన్స్ పరీక్షలు జరగనున్నాయని, ఈ దశలో కోర్టులు జోక్యం చేసుకోరాదని, దీనివల్ల అభ్యర్థులకు


మిగతా 2లో..


# ధరణి పోర్టల్ రద్దు..

- త్వరలో కొత్త చట్టం
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



హైదరాబాద్, (ప్రజా మంటలు): ధరణి పోర్టల్ ను రద్దు చేసి త్వరలో ఆర్ఓఆర్ చట్టం తీసుకు వస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. ఈ నెలాఖరులోగా అమల్లోకి తెస్తామని చెప్పారు. ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా ఉండే విధంగా రూపొందించాం.. ప్రజల అభిప్రాయాలు పరిగణలోకి తీసుకుంటాం.. గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్స్ ను గాలికి వదిలేసింది.. పూర్తైన ఇండ్లను దసరా లోపు పేద ప్రజలకు అందజేస్తామని ఆయన వెల్లడించారు. ఇక, వెంటనే మరమ్మత్తులు మౌలిక వసతులు కల్పిస్తాం.. ప్రతి నియోజకవర్గానికి 3500 నుంచి 4 వేల ఇండ్లు మంజూరు.. ప్రతిపక్షాల సలహాలు, సూచనలు స్వీకరిస్తామని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈనెల 7వ తేదీత ప్రజా ప్రభుత్వం ఏర్పాడి 10 నెలలు పూర్తి అవుతుంది అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. 10 నెలల్లో ప్రజలు కోరుకున్న వాటిని సాధించలేక పోయాం.. రాబోయే రోజుల్లో తెల్ల రేషన్ కార్డు సహా అన్ని పథకాలకు స్మార్ట్ కార్డుతో అనుసంధానం చేస్తాం.. ఈ దసరా లోపు స్మార్ట్ కార్డులు ఇస్తాం.. అర్హతలను బట్టి స్మార్ట్ కార్డు ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తాం.. రాబోయే నాలుగేళ్లలో ఇందిరమ్మ ఇళ్లకు అర్హులైన ప్రతి పేదలకు ఇళ్లు ఇస్తామన్నారు. జనవరి నుంచి ఆసరా పెన్షన్లు, సన్న బియ్యం పంపిణీ చేస్తాం.. రుణ మాఫీ కానీ రైతులకు 13 వేల కోట్ల రూపాయలతో త్వరలో విడుదల చేస్తామని ఆయన వెల్లడించారు. ప్రతిపక్షాలు సొల్లు మాటలు మాట్లాడుతున్నారు.. 10 ఏళ్లలో బీఆర్ఎస్ రైతులకు ఇచ్చింది 15 వేల కోట్లు మాత్రమే.. ప్రతిపక్ష పార్టీలు పోరం బోకు మాటలు మాట్లాడుతున్నాయని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మండిపడ్డారు.

మొదటి పేజీ తరువాయి

● దద్దరిల్లిన దండకారణ్యం

# భారీ ఎన్‌కౌంటర్

## 30 మంది నక్సల్స్ మృతి

కొనసాగుతున్నట్లు ఐజీ తెలిపారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకు బస్తర్ ప్రాంతంలో 170మందికి పైగా మావోయిస్టులు మృతిచెందినట్లు పోలీసులు పేర్కొంటున్నారు.నక్సలైట్లు ఉన్నారనే సమాచారంతో భద్రతా బలగాలు ఈ ప్రాంతంలో సెర్చ్ ఆపరేషన్ నిర్వహిస్తున్న సమయంలో ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఘటనలో భద్రతా బలగాలు సురక్షితంగా ఉన్నాయి. ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని తెలుస్తోంది. నారాయణపూర్, దంతెవాడ జిల్లాల పోలీస్ బృందాలు ఈ ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్నాయి. బస్తర్ వ్యాప్తంగా యాంటీ నక్సల్ ఆపరేషన్ కొనసాగిస్తున్నట్లు దంతెవాడ ఎస్పీ గౌరవ్ రాయ్ తెలిపారు. ఎన్‌కౌంటర్ తర్వాత భారీగా ఆయుధాలు, పేలుడు పదార్థాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

## తిరుపతి లడ్డూపై సుప్రీం స్వతంత్ర సిట్

వెల్లడించడం గమనార్హం.రాజకీయంగా తిరుమలతిరుపతి లడ్డు విషయంలో వాఖ్యలు చేయొద్దు కూడా వెల్లడించింది సుప్రీం కోర్టు. ఇకతిరుమల శ్రీవారి లడ్డూ వివాద పిటీషన్ పై సుప్రీం కోర్టులో... టిటిడి తరఫున సిద్ధార్థ లూథ్రా, ఏపి ప్రభుత్వం తరఫున ముకుల్ రోత్గి వాదనలు వినిపించారు. టిటిడి మాజీ ఛైర్మన్, రాజ్యసభ సభ్యులు వై.వి. సుబ్బారెడ్డి తరఫున కపిల్ సిబల్ వాదనలు వినిపించడం జరిగింది. సుబ్రహ్మణ్యస్వామి స్వయంగా తానే వాదనలు వినిపించారు. అయితే.. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుపై వైసీపీ సంబరపడిపోతుంది. కాగా అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన ఈ తీర్పును ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు స్వాగతించారు.సిట్ (స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్) ఏర్పాటు నిర్ణయాన్ని ఆయన అభినందించారు. ఈ మేరకు, చంద్రబాబు "ఎక్స్" (ట్విట్టర్) వేదికగా స్పందిస్తూ, "తిరుపతి లడ్డూ కల్తీ వ్యవహారంపై దర్యాప్తుకు సీబీఐ, ఏపీ పోలీసులు, ఎఫ్ఎస్ఎస్ఏఐ అధికారులతో కూడిన సిట్‌ను ఏర్పాటు చేస్తూ సుప్రీంకోర్టు జారీ చేసిన ఆదేశాలను స్వాగతిస్తున్నాను. సత్యమేవ జయతే. ఓం నమో వేంకటేశాయ" అని ట్వీట్ చేశారు. ఈ తీర్పు సత్యం , న్యాయాన్ని సమర్థించడంలో కీలకమైన అడుగు అని, అన్ని సంబంధిత పక్షాల సమర్థనంతో దర్యాప్తు జరగాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## తెలంగాణ బిడ్డలను అంతర్జాతీయ క్రీడాకారులుగా తయారు చేయాలి

విజయం సాధించిన వారికి ఎంత ప్రోత్సాహకం అందించాలి, ఎవరికి ఉద్యోగం ఇవ్వాలి.. అనే మార్గదర్శకాలను ఖరారు చేయాలని అధికారులను ఆదేశించారు. మూసాయిదాకు సంబంధించి పవర్ పాయింట్ ప్రజంటేషన్లను పరిశీలించిన ముఖ్యమంత్రి పలు మార్పులు చేర్పులను సూచించారు.

## గ్రూప్-1 నోటిఫికేషన్‌పై హైకోర్టులో తీర్పు రిజర్వు

తీవ్ర నష్టం కలుగుతుందని పేర్కొంది.గ్రూప్-1 పోస్టుల భర్తీ నిమిత్తం 2022లో జారీ చేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేయకుండా మరో నోటిఫికేషన్ జారీ చేయడం చెల్లదని, ప్రాథమిక కీలో తప్పులున్నాయని, వాటిని సవరించాలన్న అభ్యంతరాలను పట్టించుకోకపోవడాన్ని సవాల్ చేస్తూ పలువురు అభ్యర్థులు రెండు వేర్వేరు పిటిషన్‌లు దాఖలు చేశారు. వీటిపై న్యాయమూర్తి జస్టిస్ పుల్లా కార్తీక్ విచారణ చేపట్టారు. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది రాహుల్‌రెడ్డి, టీజీపీఎస్సీ తరఫున ఎం.రాంగోపాల్‌రావులు వాదనలు వినిపిస్తూ పరీక్షలు రాసిన 3 లక్షల మంది నుంచి ప్రిలిమ్స్ కీపై భౌతికంగా 721, ఆన్‌లైన్ ద్వారా 6,470 అభ్యంతరాలు వచ్చాయని తెలిపారు.వాటిని నిపుణుల కమిటీ పరిశీలించిందన్నారు. ప్రధానంగా ఉన్నవాటిని పరిగణనలోకి తీసుకుని కమిటీ సిఫారసుల మేరకు రెండు ప్రశ్నలను తొలగించి కీని విడుదల చేశామని వివరించారు. ప్రస్తుతం పిటిషన్ దాఖలు చేసిన ఐదుగురిలో ఒక్కరే కమిషన్‌కు అభ్యంతరాలు తెలియజేశారన్నారు. మిగిలినవారు ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం చేయకుండా కోర్టును ఆశ్రయించారన్నారు. రెండోసారి నోటిఫికేషన్ జారీని సవాల్ చేసిన అభ్యర్థితో పాటు కీని సవాల్ చేసిన పిటిషనర్లలో ముగ్గురు మెయిన్స్‌కు అర్హత సాధించారన్నారు. ప్రశ్నలకు విశ్లేషణాత్మకంగా ఆలోచించి సమాధానం ఇవ్వాల్సి ఉంటుందని, ఒకరిద్దరికి అర్థం కానంత మాత్రాన అవి తప్పులైనట్లు కాదన్నారు. పరీక్షలను నిష్పాక్షికంగా నిర్వహిస్తున్నామని, ఈ పిటిషన్‌లను కొట్టివేయాలని కోరారు. వాదనలు పూర్తికాకపోవడంతో తదుపరి విచారణను న్యాయమూర్తి శుక్రవారానికి వాయిదా వేశారు. ఇవాళ కూడా వాదనలు విన్న న్యాయస్థానం తీర్పును రిజర్వు చేసింది.

# అనిశ్చిత పరిస్థితులున్నా అభివృద్ధి చెందుతున్నాం

**– పెట్టుబడులకు భారత్ స్వీట్ స్పాట్‌గా భారత్**

**– 7 శాతం వృద్ధిని నమోదు చేశాం:ప్రధాని మోదీ**

న్యూఢిల్లీ,(ప్రజా మంటలు):



ప్రపంచ వ్యాప్తంగా భౌగోళిక అనిశ్చిత పరిస్థితులు కొనసాగుతున్నా భారత్ 7 శాతం వృద్ధిని నమోదు చేస్తోందని ప్రధాని మోదీ అన్నారు. భారత్‌లో పెట్టుబడులకు ఇదే సరైన సమయమని పెట్టుబడిదారులు భావిస్తున్నారని చెప్పారు.ఈ అనిశ్చితి వేళ పెట్టుబడులకు భారత్ స్వీట్ స్పాట్‌గా మారిందన్నారు. భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధి పథాన్ని కొనసాగించే దిశగా పరివర్తన మార్పులు కొనసాగుతున్నాయని చెప్పారు. కౌటిల్య ఆర్థిక సదస్సులో ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా అవతరించాలంటే వ్యవస్థీకృత సంస్కరణలు అవసరం అని అభిప్రాయపడ్డారు.మూడోసారి అధికారం చేపట్టిన తర్వాత ఉద్యోగాలు, నైపుణ్యం, సుస్థిరాభివృద్ధి, వేగవంతమైన విస్తరణ వంటి అంశాలపై దృష్టి సారించినట్లు ప్రధాని మోదీ చెప్పారు. భౌగోళిక అత్యవసర పరిస్థితులు నెలకొన్న వేళ ప్రపంచమంతా భారత్ గురించి మాట్లాడుతుందంటే.. ఆయా దేశాలకు మన దేశం పట్ల ఉన్న నమ్మకానికి నిదర్శనమని చెప్పారు. గడిచిన పదేళ్లలో చేపట్టిన సంస్కరణలే అందుకు కారణమన్నారు. ప్రపంచంలోనే భారత్ వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా ఉందని, ప్రస్తుతం ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా కొనసాగుతున్నామన్నారు.అత్యధికంగా ద్విచక్ర వాహనాలు, ట్రాక్టర్లు తయారయ్యే దేశం మనదేనని ప్రధాని మోదీ అన్నారు. మొబైల్ ఫోన్ల తయారీలో రెండో స్థానంలో ఉన్నామన్నారు. సంస్కరించు, పనితీరు మెరుగుపరుచు, రూపాంతరం చెందు అనేది తమ ప్రభుత్వం నిత్యం పటించే మంత్రమని చెప్పారు. 140 కోట్ల మంది భారతీయుల విశ్వాసమే మన బలమని పేర్కొన్నారు. భారత అభివృద్ధి కోసం మరిన్ని నిర్మాణాత్మక సంస్కరణలు తీసుకురావడానికి తాము కట్టుబడి ఉన్నామని చెప్పారు. గడిచిన పదేళ్లలో 25 కోట్ల మంది ప్రజలు పేదరికం నుంచి బయటపడ్డారని పేర్కొన్నారు. బ్యాంకింగ్ వ్యవస్థను బలోపేతం చేయడం; జీఎస్టీని తీసుకురావడం; దివాలా స్మృతి; గనులు, రక్షణ రంగాల్లో ప్రైవేటు పెట్టుబడులకు ప్రోత్సాహం; ఎఫ్‌డీఐ నిబంధనలు సరళీకరించడం వంటివి తమ ప్రభుత్వ విజయాలుగా ప్రధాని మోదీ పేర్కొన్నారు.

# మూసీ ప్రక్షాళన ఆగదు

- ఎన్ని ఆటంకాలు ఎదురైనా పూర్తి చేస్తాం
- జీహెచ్ఎంసీలో 4 మేయర్ స్థానాలు
- ఏర్పాటుకు సాధ్యాసాధ్యాలపై పరిశీలిస్తున్నాం
- జనాభా ప్రాతిపదికన విభజించి ఎన్నికలకు వెళ్తాం
- మహానగరపాలక సంస్థ విభజనపై మంత్రి కోమటిరెడ్డి కీలక వ్యాఖ్యలు

హైదరాబాద్, (ప్రజా మంటలు):

హైదరాబాద్ మహానగర జనాభా కోటిన్నర దాటిందని జీహెచ్ఎంసీని నాలుగు మేయర్లుగా విభజించి ఎన్నికలకు వెళ్లే అంశం పరిశీలనలో ఉందని రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. అసోచామ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అర్బన్‌ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సమిట్?లో కోమటిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రీజినల్ రింగ్ రోడ్డుతో హైదరాబాద్ మహానగర రూపు రేఖలు మారిపోతాయని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు.దాదాపు 30వేల కోట్ల రూపాయలతో చేపట్టే ఈ ప్రాజెక్టుకు కేంద్రం సాయం అందిస్తోందని ఆయన పేర్కొన్నారు. మరో రెండు నెలల్లో రీజినల్ రింగు రోడ్డుకు టెండర్లు పిలుస్తామని తెలిపారు. మూసీ సుందరీకరణకు ప్రభుత్వం ఇప్పటికే ప్రణాళిక సిద్ధం చేసిందని, దీనివల్ల రంగారెడ్డి, హైదరాబాద్, నల్గొండ జిల్లావాసులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని మంత్రి కోమటిరెడ్డి తెలిపారు. మూసీ కంటే విషపూరితమైన సబర్మతిని ప్రక్షాళన చేసి మంచినీరు ప్రవహించే విధంగా మార్చారన్నారు. ఎన్నో పరిశ్రమల నుంచి రసాయనాలతో పాటు మురికి నీరంతా మూసీలోకే వస్తోందని,



ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఎన్ని ఆటంకాలు ఎదురైనా మూసీ సుందరీకరణ పూర్తి చేసి తీరుతామని కోమటిరెడ్డి తెలిపారు. హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలోనే మూసీ నది ఆక్రమణలపై మార్కింగ్ చేశారని, తాము మరింత ముందుకు వెళ్తుంటే ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్ నేతలు రాజకీయ లబ్ధి కోసం రాద్ధాంతం చేస్తున్నారని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. అర్బన్ స్ట్రాటజీస్, పాలసీస్, రెగ్యులేషన్ అంశాలపై పలువురు వక్తలు ప్రసంగించారు. "మా మంత్రివర్గం, ముఖ్యమంత్రి రేవంత్?రెడ్డి కలిసి మూసీనది ప్రక్షాళనకు కీలక నిర్ణయం తీసుకున్నాం. నమామి గంగ పేరిట సబర్మతి రివర్?ను వాళ్లు క్లీన్? చేసినప్పుడు మనమెందుకు మూసీ సుందరీకరణ చేపట్టకూడదని ఆలోచన చేశాం. ఇదే అంశంపై గతంలో బీఆర్?ఎస్? మార్కింగ్ కూడా చేశారు. కానీ ఇప్పుడు దానిపై రాద్ధాంతం చేసి రాజకీయంగా ఎదగాలని చూస్తున్నారు" అని అన్నారు

## ఉగ్రజాబితా నుంచి తాలిబన్ల తొలగింపు

**- రష్యా కీలక నిర్ణయం**

మాస్కో (ప్రజా మంటలు):

అఫ్గానిస్థాన్‌ను స్వాధీనం చేసుకున్నప్పటికీ.. తాలిబన్ల పాలనను ప్రపంచ దేశాలు అధికారికంగా గుర్తించడం లేదు. ఈ క్రమంలో వారికి ఊరట కలిగించే నిర్ణయం వెలువడింది.ఉగ్రవాద సంస్థల జాబితా నుంచి తాలిబన్‌ను తొలగించాలని రష్యా నిర్ణయించింది. ఇందుకు సంబంధించి అత్యున్నత స్థాయిలో ఓ నిర్ణయం తీసుకున్నట్లు రష్యా విదేశాంగ శాఖ ప్రకటించింది. అఫ్గానిస్థాన్ నుంచి ఆగస్టు 2021లో అమెరికా బలగాల ఉపసంహరణ తర్వాత.. అక్కడి పాలన తాలిబన్ల చేతుల్లోకి వెళ్లిపోయింది. అయినప్పటికీ ప్రపంచంలో ఏ దేశం కూడా వారి పాలనను అధికారికంగా గుర్తించలేదు. కేవలం చైనా, యూఏఈలు మాత్రమే తాలిబన్‌ల రాయబారులను అంగీకరించాయి. అయితే, 2003లో 'తాలిబన్'ను ఉగ్రవాద సంస్థల జాబితాలో చేర్చిన రష్యా.. వారితో సత్సంబంధాలు కొనసాగించేందుకు ఇటీవల ప్రయత్నాలు మొదలుపెట్టింది. ఇదే అంశంపై ఈ ఏడాది జులైలో మాట్లాడిన పుతిన్ తాలిబన్ ఉద్యమాన్ని ఉగ్రవాదంపై పోరులో భాగంగానే చూస్తామని చెప్పారు.తాజా పరిణామాలపై రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ మాట్లాడుతూ.. అఫ్గాన్ ప్రభుత్వంతో తాము ఆచరణాత్మక సంప్రదింపులు జరిపే అవసరముందన్నారు. ఆ దేశంతో రాజకీయ, వాణిజ్య, ఆర్థిక సంబంధాలను కొనసాగించేందుకు తమ ప్రయత్నాలు కొనసాగుతాయన్నారు. తాజా నిర్ణయం వాస్తవరూపం దాల్చడానికి చట్టపరమైన పలు నిబంధనలు పాటించాల్సి ఉందని అఫ్గాన్ వ్యవహారాలు చూసే రష్యా ప్రతినిధి పేర్కొన్నారు.

## గిరిజనులకు రిజర్వేషన్లలో అన్యాయం.. మహారాష్ట్ర సచివాలయం వద్ద తీవ్ర ఉద్రిక్తత

**– భవనం మూడో అంతస్తు నుంచి దూకిన డిప్యూటీ స్పీకర్, ఎమ్మెల్యేలు**

**– సెఫ్టీ వలలో పడటంతో సురక్షితంగా బయటకు తీసుకొచ్చిన పోలీసులు**

ముంబై (ప్రజా మంటలు):

మహారాష్ట్ర సచివాలయం మంత్రాలయం వద్ద శుక్రవారంనాడు తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. సచివాలం మూడో అంతస్తు నుంచి అధికార కూటమికి చెందిన ఎన్‌సీపీ ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ నరహరి జిర్వాల్ సహా పలువురు గిరిజన ఎమ్మెల్యేలు కిందకు దూకడం కలకలం రేపింది. అయితే ఇలాంటి ఘటనలను అడ్డుకునేందుకు ఏర్పాటు చేసిన సేఫ్టీ వలలో వారు చిక్కుకుపోయారు. పోలీసులు వారిని సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. జిర్వాల్‌తో పాటు బీజేపీ ఎంపీ హేమంత్ సవ్రా, ఎమ్మెల్యేలు కిరణ్ లహమతే, హిరిమాన్ ఖోస్కర్, రాజేష్ పటేల్ కూడా సేఫ్టీ నెట్‌లపై దూకిన వారిలో ఉన్నారు. పోలీసులు వారిని బయటకు తెచ్చిన తర్వాత కూడా వారు తన నిరసనను మంత్రాలయ ఆవరణలో కొనసాగించారు. పంచాయతీల (ఎక్స్‌టెన్షన్ టు షెడ్యూల్డ్ ఏరియాస్–పీఈఎస్ఏ) చట్టం 1996 కింద గిరిజనులను ప్రభుత్వ ఉద్యోగాల్లో నియమించాలని గిరిజన ఎమ్మెల్యేలు నిరసన తెలుపుతున్నారు. పీఈఎస్ఏలో రాష్ట్ర ప్రభుత్వ స్థాయిలో అక్టోబర్ 2023 నుంచి 17 వివిధ కేటగిరీల్లో గిరిజనుల రిక్రూట్‌మెంట్ ప్రక్రియను నిలిపి వేశారని వారు తెలిపారు. రెవెన్యూ, ఆరోగ్య శాఖ సహా పలు శాఖల్లో టీచర్లు, ఫారెస్ట్ గార్డు, ఇతర పోస్టులకు రిక్రూట్‌మెంట్ జరుపుతున్నారని, గిరిజనేతరులు ఉద్యోగాల్లో చేరడం, నియామక పత్రాలు అందుకోవడం జరిగినా, పీఈఎస్‌లో రిజర్వ్‌డ్ పోస్టులను ఇంతవరకూ రిక్రూట్ చేయలేదని వారన్నారు. పీఈసీఏ కింద షెడ్యూల్డ్ ట్రైబ్ అభ్యర్థులను నియామకాల సస్పెండ్‌కు వ్యతిరేకంగా, ఎస్సీ జాబితాలో ధాంగర్స్‌ను చేర్చడాన్ని నిరసిస్తూ వీరంతా ఆందోళనకు దిగారు. ముఖ్యమంత్రిని కలుసుకునేందుకు ప్రయత్నించినా ప్రయోజనం లేకపోవడంతోనే తాము మంత్రాలయ నుంచి కిందకు దూకాలని నిర్ణయించుకున్నట్టు చెప్పారు. 15 నుంచి 16 మంది గిరిజన ఎమ్మెల్యేలు మంత్రాలయ వద్ద నిరసనల్లో పాల్గొనగా, వారిలో పలువురు అక్కడి నెట్‌లపైకి దూకారు. ఈ నేపథ్యంలో సమస్యను పరిష్కరించేందుకు గిరిజన ఎమ్మెల్యేలతో ముఖ్యమంత్రి ఎక్‌నాథ్ షిండే శుక్రవారం సాయంత్రం సమావేశం ఏర్పాటు చేసే అవకాశం ఉంది.

## ఇజ్రాయెల్ ఎప్పటికీ గెలవలేదు

- మా శత్రువులను ఓడిస్తాం
- ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ కీలక వ్యాఖ్యలు
- శత్రువులను ఓడించాలని ప్రతిజ్ఞ
- టెహ్రాన్‌లోని మసీదు వద్ద వేలాది మద్దతుదారులనుద్దేశించి ఉపన్యాసం
- ఐదేళ్లలో తొలిసారిగా ప్రజల మధ్యలో ప్రసంగం

ఇజ్రాయిల్ (ప్రజా మంటలు):

హిజ్బుల్లా చీఫ్ హసన్ నస్రల్లా మరణం, ఇజ్రాయిల్‌పై ఇరాన్ 200కి పైగా బాలిస్టిక్ క్షిపణి దాడుల తర్వాత తొలిసారి ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ ఉపన్యసించారు. "మేము మా శత్రువులను ఓడిస్తాము" అని ఖమేనీ ఇరాన్ ప్రజల్ని ఉద్దేశించి మాట్లాడారు. శుక్రవారం తన ఉపన్యాసంలో ఇజ్రాయిల్‌కి వ్యతిరేఖంగా పాలస్తీనియన్లకు, లెబనీస్ ప్రజలకు మద్దతు తెలిపారు. తమ శత్రువులను ఓడించాలని ప్రతిజ్ఞ చేశారు. టెహ్రాన్‌లోని ఒక మసీదు వద్ద వేలాది మంది మద్దతుదారులను ఉద్దేశించి ఖమేనీ మాట్లాడారు. ఇటీవల ఇజ్రాయిల్‌పై జరిగిన క్షిపణి దాడుల్ని "ప్రజాసేవ"గా అభివర్ణించారు. హమాస్ లేదా హిజ్బుల్లాకు వ్యతిరేకంగా ఇజ్రాయిల్ ఎన్నటికీ విజయం సాధించలేదని, ఇరాన్ మీతో ఉందని అతను ప్రకటించాడు.ఇటీవల హిజ్బుల్లా చీఫ్ హసన్ నస్రల్లా మరణం తర్వాత ఖమేనీ రహస్య ప్రాంతానికి వెళ్లినట్లు వార్తలు వచ్చాయి. అతడి ప్రాణాలకు ఇజ్రాయిల్ నుంచి ప్రమాదం ఉందనే నివేదికల నేపథ్యంలో ఈ వార్తలు సంచలనంగా మారాయి. ఇదిలా ఉంటే, గత ఐదేళ్లలో తొలిసారిగా ఖమేనీ శుక్రవారం రోజు ఉపన్యసించారు. మంగళవారం ఇజ్రాయిల్‌పై ఇరాన్ క్షిపణులతో దాడులు చేసింది. ఈ దాడులకు ప్రతీకారం తీర్చుకుంటామని ఇజ్రాయిల్ వార్నింగ్ ఇచ్చింది. ఖమేనీ తన ప్రసంగంలో హసన్ నస్రల్లాని కొనియాడారు. నస్రల్లా మనతో లేకున్నా, అతడి ఆత్మ, అతడి మార్గం మనకు ఎప్పటికీ స్ఫూర్తినిస్తుందని చెప్పాడు. అతడి బలిదానం మరింత ప్రభావాన్ని పెంచుతుందని అన్నాడు. నస్రల్లా మరణం వృథా కాదని, మన విశ్వాసాన్ని బలపరుస్తూనే ఉంటుందని, శత్రువులకు వ్యతిరేకంగా నిలబడాలని అన్నారు. లెబనాన్ రక్తపాతంలో ఉన్న ప్రజలకు సాయం చేయడానికి జిహాద్, అల్ అక్సా మసీదు కోసం యుద్ధానికి మద్దతు ఇవ్వడం ముస్లింలందరి విధి, బాధ్యత అని ఆయన అన్నారు. ఇజ్రాయిల్‌పై అక్టోబర్ 07 నాటి దాడిని సరైన చర్యగా అభివర్ణించాడు.

**ఇజ్రాయెల్ దాడుల్లో నస్రల్లా వారసుడు సఫీద్దీన్ మృతి?**

బీరూట్(జనంసాక్షి): హిజ్బుల్లా లక్ష్యాలపై ఇజ్రాయెల్ వైమానిక దాడులను ముమ్మరం చేసింది. ఈ నేపథ్యంలో ఇజ్రాయెల్ హిజ్బుల్లా లక్ష్యాలను ఎంపిక చేసి నాశనం చేస్తోంది. హసన్ నస్రల్లాను చంపిన తర్వాత, ఇజ్రాయెల్ మీడియా ఇప్పుడు అతని వారసుడు హషీమ్ సఫీద్దీన్‌ను చంపినట్లు పేర్కొంది. అందిన సమాచారం ప్రకారం, బీరూట్‌లో హషీమ్ సఫీద్దీన్‌ను లక్ష్యంగా చేసుకున్నారు. ముగ్గురు ఇజ్రాయెల్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు గురువారం అర్ధరాత్రి భీకరమైన వైమానిక దాడులను చేశాయని., అందులో హత్యకు గురైన హిజ్బుల్లాహ్ నాయకుడు హసన్ నస్రల్లా బంధువు, సంభావ్య వారసుడు హషీమ్ సఫీద్దీన్‌పై దాడులు జరిగాయని తెలిపాయి.ఈ ఇజ్రాయెల్ దాడి నస్రల్లాను చంపిన దాడి కంటే చాలా పెద్దదని చర్చించుకుంటున్నారు. తాజాగా జరిగిన దాడులలో బంకర్ పూర్తిగా ధ్వంసమైంది. బీరూట్‌లోని దహీహ్ శివారులోని హషీమ్ సఫీద్దీన్‌ను లక్ష్యంగా చేసుకుని ఈ దాడి జరిగింది. సఫీద్దీన్ సీనియర్ హిజ్బుల్లా అధికారులతో అండర్‌గ్రౌండ్ బంకర్‌లో రహస్య సమావేశం నిర్వహిస్తున్నప్పుడు ఈ దాడి జరిగింది. ఇజ్రాయెల్ నస్రల్లాను చంపిన తర్వాత ఈ ప్రాంతంలో జరిగిన అత్యంత పెద్దదైన బాంబు దాడుల్లో ఇది ఒకటి.ఈ దాడికి సంబంధించి ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ (%×ఐఖీ%) లేదా లెబనాన్ లోని హిజ్బుల్లా నుండి ఇంకా అధికారిక ప్రకటన లేదు. హమాస్ నెట్‌వర్క్ అధిపతి జాహి యాసర్ అబ్ద్ అల్–రజెక్ ఔఫీని వెస్ట్ బ్యాంక్ లోని తుల్కర్మ్‌లో పగటిపూట చంపినట్లు ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ (ఐడిఎఫ్) గురువారం రాత్రి ప్రకటించింది. సెప్టెంబరు 2న ఎత్రెటాట్‌లో కార్ బాంబింగ్ దాడికి ఓఫీ ప్లాన్ చేసినట్లు %×ఐఖీ% ఒక ప్రకటనలో తెలిపింది. వెస్ట్ బ్యాంక్‌లో ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా అనేక దాడులకు ఓఫీ ప్లాన్ చేసినట్లు ప్రకటన పేర్కొంది.

## నేడు హర్యానాలో పోలింగ్..

**- ఓటింగ్ కేంద్రాలవద్ద భారీ భద్రతా ఏర్పాట్లు**

హర్యానా(ప్రజా మంటలు):



దేశంలో నేడు మరో రసవత్తర పోరుకు హర్యానా రాష్ట్రం సిద్ధమైంది. లోక్‌సభ ఎన్నికల తర్వాత జరుగుతున్న ఎన్నికలు కావడంతో దేశ ప్రజల చూపు హర్యానాపై ఫోకస్ మళ్లింది. ఇక్కడ కాంగ్రెస్–బీజేపీ మధ్య తీవ్ర పోటీ నెలకొంది. హర్యానాలో మొత్తం 90 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. ఒకే విడతలో సెప్టెంబర్ 5(శనివారం) పోలింగ్ జరగనుంది. ఇందుకోసం అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇక పోలింగ్ సిబ్బంది ఈవీఎంలను తీసుకుని పోలింగ్ స్టేషన్లకు చేరుకుంటున్నారు. ఇక ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. హర్యానాలో కాంగ్రెస్–బీజేపీ పోటాపోటీగా ప్రచారం చేశాయి. మరొకసారి అధికారం కోసం బీజేపీ కృషి చేయగా.. అధికారం ఛేజిక్కించుకోవాలని కాంగ్రెస్ శాయశక్తులా ప్రయత్నం చేసింది. అలాగే ఆప్ కూడా కొన్ని స్థానాల్లో పోటీ చేస్తోంది. కొన్ని స్థానాల్లో ఆమ్ ఆద్మీ పార్టీ కూడా ప్రభావం చూపించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రధాని మోడీ, అమిత్ షా, రాహుల్ గాంధీ, మల్లిఖార్జున ఖర్గే లాంటి ముఖ్యమైన నేతలంతా ప్రచారంలో దూసుకుపోయారు. రెండు పార్టీలు కూడా మాటల తూటాలు పేల్చుకున్నారు. ఇక భారత రెజ్లర్ వినేష్ ఫోగట్ ఎన్నికల బరిలోకి దిగారు. కాంగ్రెస్ నుంచి జులానా నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా నిలబడ్డారు.ఇక హర్యానా ఎన్నికలు ముగియగానే ఎగ్జిట్స్ పోల్స్ విడుదల కానున్నాయి. జమ్మూకాశ్మీర్‌లో మూడు విడతలగా పోలింగ్ జరిగింది. సెప్టెంబర్ 18, 25, అక్టోబర్ 1న ప్రశాంతంగా ఓటింగ్ ముగిసింది. ఇక్కడ భారీగానే ఓటింగ్ నమోదైంది. శనివారం సాయంత్రం 5 గంటల తర్వాత హర్యానా, జమ్మూకాశ్మీర్ ఎగ్జిట్ పోల్స్ విడుదల కానున్నాయి. మరీ ఈసారి ప్రజలు ఎవరికీ అధికారం కట్టబెట్టనున్నారో చూడాలి.

# మాతృ దర్శన్ ట్రస్ట్ ఉచిత కంటి శిబిరం



జనగామ అక్టోబర్ 04 (ప్రజామంటలు): మాతృదర్శన్ ట్రస్ట్, శరత్ మాక్స్ విజన్ ఐ కేర్ హాస్పిటల్స్, వరంగల్‌తో కలిసి చంపక్ హిల్స్‌లోని ట్రస్ట్ కార్యాలయంలో ఉచిత కంటి శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించింది. ఈ శిబిరానికి పసరమడ్ల, శామీర్ పేట, ఓబులకేశవాపూర్‌కు చెందిన సుమారు 120 మంది గ్రామస్తులు హాజరై కంటి పరీక్షలు చేసి ఆరోగ్య నివేదికలు స్వీకరించారు. కార్యక్రమం "జ్ఞాన దీపిక" అవగాహనా సదస్సుతో ప్రారంభమైంది, మాతృదర్శన్ ట్రస్ట్ అధికారిక ప్రతినిధి చంద్రశేఖర్ ట్రస్ట్, దాని వివిధ కార్యకలాపాల యొక్క స్థూలదృష్టిని అందించారు. విద్య, మహిళా సాధికారత ద్వారా గ్రామీణ గ్రామాలను సాధికారత సాధించాలనే లక్ష్యంతో 1982లో దివంగత ప్రొఫెసర్ వెదిరె మధుసూదన్ రెడ్డి హైదరాబాద్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ స్టడీస్ శాఖగా ట్రస్ట్‌ను స్థాపించారని ఆయన వివరించారు. 2000 సంవత్సరం నుండి, ట్రస్ట్ ఒక ఉచిత బోర్డింగ్ స్కూల్, అదితి గురుకులాన్ని నిర్వహిస్తోంది, 1వ తరగతి నుండి 4వ తరగతి వరకు విద్యార్థులకు ఉచిత విద్య, భోజనం వసతిని అందిస్తుంది, 4వ తరగతి తర్వాత ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలల్లో ప్రవేశానికి వారిని సిద్ధం చేస్తుంది. అదనంగా, ట్రస్ట్ ఐదు గ్రామాలలో కుట్టు కేంద్రాలను నిర్వహిస్తుంది, గ్రామీణ ప్రాంతాల నుండి వందలాది మంది మహిళలకు ఉపాధి అవకాశాలను అందిస్తుంది. ట్రస్ట్ అనేక ఆరోగ్య శిబిరాలు, రైతు సాధికారత కార్యక్రమాలను కూడా నిర్వహించింది, మాక్స్ విజన్ సహకారంతో ఈ ప్రయత్నాలలో నేటి కంటి శిబిరం నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో, ట్రస్ట్ విద్యాసంస్థల్లో ఒకటైన న్యూ క్రియేషన్ స్కూల్ ప్రిన్సిపాల్ డా. వంశీ శ్రీ మాతా, శ్రీ అరబిందో గురించి మాట్లాడుతూ%ూ%. ట్రస్ట్ వ్యవస్థాపకుడికి వారు ఎలా స్ఫూర్తినిచ్చారనే విషయాలపై అవగాహనలను పంచుకున్నారు. వారి ప్రియా శిష్య డైన చంపక్ లాల్ ఈ ప్రదేశాన్ని సందర్శించడం వలన కాకుల గండి గా ఉన్న ఈ ప్రాంతానికి "చంపక్ హిల్స్" అని పేరు వచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు వి. రమేష్ రెడ్డి, ఆరోగ్య శ్రీనివాస్, మాక్స్ విజన్ నుండి నేత్ర వైద్య నిపుణుడు డా. సతీష్, డా. సింధు యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

## జనగామ గుండ్ల గడ్డ కృష్ణబావి దేవి నవరాత్రుల మహోత్సవంలో అన్న ప్రసాదం



జనగామ అక్టోబర్ 04 (ప్రజామంటలు): జనగామ గుండ్లగడ్డ కృష్ణ బావి గత 06 సంవత్సరాలుగా అమ్మవారి దీవెనలతో సుఖశాంతులతో అంగరంగ వైభవంగా దేవీ నవరాత్రులు జరుపుకుంటున్నారు 28 వార్డులో ఆ వాడకట్టు ప్రజలు పెద్దలు ప్రముఖులు పిల్లలు కోరిన కోరికలు నెరవేర్చే తల్లిగా తెలిపారు. అమ్మవారి అన్న ప్రసాదం దాత ఎండీ ఆంజాద్ అలీ వారి దంపతులు సబ్ రిజిస్ట్రేషన్, భవాని యూత్ కమిటీ సభ్యులు శేషు విరాట్, ఎనగందుల శ్రీనివాస్ దుబాయ్ శేషు, గుజనేని త్రియంబకేష్, చెల్రోజు నవీన్ కుమార్, ఆకుల నరేష్, గోగికర్ శివాజీ, బొల్లం కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

# సాదా బైనామాలకు అవకాశం.. అన్నదాతల హర్షం..

-కొత్త రెవెన్యూ చట్టంతో రైతుల సమస్యలకి పరిష్కారం..
-ఉమ్మడి జిల్లాలో 1.12లక్షల దరఖాస్తులు..

కొత్త రెవెన్యూ చట్టం తో రైతుల పలు సమస్యలకు పరిష్కారం లభించనుంది. ప్రభుత్వం కొత్త రెవెన్యూ చట్టంను ప్రవేశపెట్టడానికి ఇటీవల అన్ని జిల్లాల కలెక్టరేట్ కార్యాలయాల్లో అన్ని వర్గాల తో అభిప్రాయ సేకరణ చేసింది.

ఈ నేపథ్యంలో ధరణి పోర్టల్లో ని వివిధ సాంకేతిక సమస్యలతో పాటు గతంలో తెల్ల కాగితాలపైన రాసుకొని భూముల కొనుగోలు చేసిన రైతుల సాదాబైనామా దరఖాస్తులకు సైతం మోక్షం కలుగనుంది. ఇందుకోసం కొత్తగా ఆర్వోఆర్ చట్టాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ధీంతో కొన్నేళ్లుగా తహశీల్దార్ కార్యాలయాల చుట్టూనే తిరుగుతున్న అన్నదాతలకు పట్టాదారుల హక్కుల కష్టాలు తీరేలా ఉన్నాయి.

ఉమ్మడి జిల్లాలో 1.12 లక్షల సాదా బైనామ దరఖాస్తులు. గత ప్రభుత్వం 2021లో మీ సేవ ద్వారా సాదాబైనామ దరఖాస్తులను ఆహ్వానించగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 1.12,557 మంది దరఖాస్తులు సమ ర్పించారు. అందులో జగిత్యాల జిల్లాలో 35,010,కరీంనగర్ జిల్లాలో 26,871, రాజన్న,సిరిసిల్ల జిల్లాలో 15,056 మంది దరఖాస్తులు సమర్పించారు. అయితే హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడంతో అప్పటి ప్రభుత్వం సాదాబైనామ ప్రక్రియ అమలు చేయలేక పోయింది.

**హక్కులు లేక సాదాబైనామ దారుల ఇబ్బందులు:**

పలు ఏళ్ళ కింద తెల్లకాగితాలపై సాదాబైనామ తో కొనుగోలు చేసుకున్న భూములకు పట్టాదారు పాసు పుస్తకాలు రాకపోవడంతో రైతులు పలు అవసరాలకు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైతు బంధు,రైతు భీమా,పంట రుణాలు, కిసాన్ సమ్మాన్ నిధి, పలు సంక్షేమ పథకాలకు రైతులు దూరమవుతున్నారు.

అవసరాలకు అమ్ముకుందామన్నా పట్టాదారు పాసుపుస్తకాలు లేక పోవడంతో ఏమీ చెయ్యలేక అవస్థలు పడుతున్నారు. ఇక గత ప్రభుత్వం తెచ్చిన ధరణి పోర్టల్ తో అటు ఎన్నో ఏళ్ళనుంచి హక్కులు కలిగిన పట్టాదారుల పేర్లు ధరణి పోర్టల్ లో కనిపించక పోవడం, పలువురు తమ భూములు అమ్ముకున్నప్పటికీ వారి పేర్లే కనిపించడం,తో వారి వారసులు ఎదురుతిరుగుతూ పోలీసుల సాయంతో ఆ భూములను స్వాధీనం చేసుకుంటున్నారు. మరి కొందరు సాదాబైనామా దారులపై కోర్టుల్లో కేసులు వేస్తున్నారు.

నిర్దేశిత రుసుము లేకుండా పట్టాదారు పాసు పుస్తకాల జారీ చేసేలా కొత్త రెవెన్యూ చట్టం లో ప్రభుత్వం చేపట్టేందుకు చర్యల పట్ల సాదాబైనామ కొనుగోలుదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే కొందరు ఈ సాదాబైనామా అమల్లో భూ యజమానుల ,వారసుల అంగీకారం అనే నిబంధన తొలగించాలని ప్రస్తుతం భూముల ధరలు విపరీతంగా పెరిగినందున తిరిగి ఆ భూ యజమానులు మమ్మల్ని మళ్లీ ఎంతో కొంత డబ్బులు ఆశించే పరిస్థితి ఉంటుందని కొందరు సాదాబైనామ దారులు , ఆ నిబంధన ఉండాలని లేకపోతే ఫోర్జరీ దరఖాస్తులు కొందరు సమర్పిస్తారని దీనితో అసలు పట్టదారులు నష్టపోతారని కొందరు ,రెవెన్యూ అధికారులకు కోర్టు కేసులు ఎదుర్కొనే పరిస్థితి ఉంటుందని మరి కొందరు వివిద అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.



**–కొత్త ఆర్వోఆర్ చట్టం తో రైతుల సమస్యలకు పరిష్కారం.**

–

గత ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణితో రైతులు,ఉద్యోగులు అనేక సమస్యలు ఎదుర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో పాత ఆర్వోఆర్ చట్టము అమలు చేసినప్పుడు పలువురు ఫోర్జరీ సాదా బైనామా లతో దరఖాస్తు చేసుకోగా రెవెన్యూ అధి కారులు విచారణ చేసి ఆ సాదాబైనామ లు తిరస్కరించారు. ప్రస్తుత కొత్త ప్రభుత్వం చేపట్టిన కొత్త రెవెన్యూ చట్టంలో సైతం సాదాబైనామా నిబంధన అమలుతో ఫోర్జరీ పత్రాల తో దరఖాస్తులు చేసుకునే సాదాబైన మాదారుల దరఖాస్తు ల విచారణలో భూ యజమానులు మరణిస్తే,వారి వారసుల అంగీకారాన్ని రెవెన్యూ అధికారులు తీసుకోక పోతే ఆ భూ యజమానులు, వారసులు కోర్టుల కెళ్లే పరిస్థితి ఉంటుంది.

దీనితో రెవెన్యూ అధికారులు న్యాయస్థానాల నుంచి కేసులకు గురయ్యే పరిస్థితి ఉంటుంది. ఏదీ ఏమైనప్పటికీ కొత్త ప్రభుత్వం సాదాబైనామ లకు అవకాశం కల్పించడం తో కొన్నేళ్లుగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న అన్నదాతలకు భూ యాజమాన్య హక్కుల కష్టాలు దూరం కానున్నాయి. కొత్త ప్రభుత్వం కొత్త రెవెన్యూ చట్టం చేసే ముందు అన్ని వర్గాల నుంచి సూచనలను తీసుకోవడం శుభపరిణామం.

**– హరి ఆశోక్ కుమార్,**
**న్యాయవాది,మాజీ జిల్లా అధ్యక్షుడు,రెవెన్యూ ఉద్యో గుల సర్వీసుల అసోసియేషన్. జగిత్యాల జిల్లా.**

## హుజురాబాద్ కోర్టులో ఘనంగా బతుకమ్మ సంబరాలు



హుజురాబాద్ అక్టోబర్ 04 (ప్రజామంటలు): శుక్రవారం హుజురాబాద్ కోర్టు ఆవరణలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హుజురాబాద్ ఇంచార్జీ సీనియర్ సివిల్ జడ్జీ కె. వెంకటేష్, మున్సిఫ్ మేజిస్ట్రేట్ జి.స్వాతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మహిళా న్యాయవాదులు, కోర్టు మహిళా ఉద్యోగులు రంగురంగు పూలతో బతుకమ్మలను అలంకరించారు. న్యాయవాదుల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బహుమతుల ప్రధానం చేశారు. మొదటి బహుమతి జూనియర్ సివిల్ జడ్జీ కోర్టుకు, రెండవ బహుమతి రెండవ అదనపు మేజిస్రేట్ కోర్టు, మూడవ బహుమతి మొదటి అదనపు మేజిస్ట్రేట్ కోర్టు, కన్సోలేషన్ బహుమతులు బార్ అసోసియేషన్, సీనియర్ సివిల్ జడ్జీ కోర్టులు దక్కించుకున్నాయి. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు గోస్కుల శ్రీనివాస్, బత్తుల తిరుపతి, బండి రమేష్, ఎజిపి గుర్రం శ్రీనివాస్, ముక్కెర రాజు, నల్ల భూమిరెడ్డి, బండి కళాధర్, లక్ష్మణ మూర్తి, శ్రీధర్ బాబు, ముస్తఫా, సాంబమూర్తి, యం. సదయ్య, నూతల శ్రీనివాస్ కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.






## నాలలపై అక్రమ నిర్మాణాలను తొలగించాలి

జనగామ అక్టోబర్ 04 (ప్రజామంటలు): జనగామ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న నాళాలపైన అక్రమంగా కొందరు ఫెర్మెంటిగా గోడలు నిర్మాణాలు చేశారు. ఇంకా కొంతమంది చేస్తూ ఉన్నారు కాబట్టి తక్షణమే జనగామ మున్సిపాలిటీ వెంటనే వీటిని తొలగించాలి అని సిపిఎం జనగామ పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్ డిమాండ్ చేశారు. ఈ నాలాల పైన జనగామ మున్సిపాలిటీ కమిషనర్ వెంకటేష్ గారికి వెంటనే తొలగించాలని మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా ప్రకాష్ మాట్లాడుతూ జనగామ మున్సిపాలిటీ పరిధిలో మెయిన్ రోడ్డు ఇరువైపులా ఉన్న మెయిన్ రోడ్డు మోరీల పైన అక్రమ నిర్మాణాలు వ్యాపార వాణిజ్య సంస్థలు చేపట్టారని ముఖ్యంగా సూర్యాపేట రోడ్డుకు గల ఉదాహరణకు ఎస్ ఎస్ ఎస్ వైన్ షాప్ యాజమాన్యం అక్రమంగా మోరిపైన అడ్డంగా నిర్మించిన సిగరెట్ పాన్ డబ్బా దుకాణాన్ని కట్టారు అని అన్నారు దీనివల్ల ముందు అటు ఇటు పోయే పాదాచార్లకు ఇబ్బంది అవుతున్నది అలాగే వీరిని చూచి ఇతర వాణిజ్య వ్యాపారుల షాపుల వారు ఈ విధంగా కట్టే ప్రమాదం కూడా ఉంది అలాగే మున్సిపల్ వర్షపు నీరు, మురుగునీరు పోవుటకు అడ్డుగోడగా ఉంది అని అన్నారు. కాబట్టి తక్షణమే మున్సిపల్ కమిషనర్ స్పందించి నాలలపై ఉన్న గోడలను తొలగించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జనగామ జిల్లా కమిటీ సభ్యులు బూడిద గోపి, వెంకటేష్ పాల్గొన్నారు.


## బీజేపీ నూతన సభ్యత్వ నమోదు

### పాల్గొన్న అసెంబ్లీ కన్వీనర్ కొమ్ము రాంబాబు



గొల్లపల్లి అక్టోబర్ 04 (ప్రజామంటలు): గొల్లపల్లి మండలం మల్లన్నపేట లో బీజేపీ నూతన సభ్యత్వ నమోదు కార్యక్రమ ముఖ్య అతిథిగా పాల్గొన్న అసెంబ్లీ కన్వీనర్ కొమ్ము రాంబాబు మాట్లాడుతూ దేశంలోనే అతి పెద్ద పార్టీగా అత్యంత ప్రజాదరణ పొందిన పార్టీగా బీజేపీ అవతరించిందని అన్నారు. నియోజకవర్గంలో ప్రజలందరూ బీజేపీ సభ్యత్వ నమోదుకు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు కట్ట మహేష్ జిల్లా అధికార ప్రతినిధి మర్రిపెల్లి సత్యం, మాజీ అసెంబ్లీ కన్వీనర్ సీనియర్ నాయకులు కస్తూరి సత్యం, మండల ఉపాధ్యక్షులు భీమా మహేష్, బూత్ అధ్యక్షులు దాసరి మల్లయ్య, బండారు నరేష్, వనపర్తి రాజేందర్, బీజేపీ సీనియర్ నాయకులు ఐటీ సెల్ కన్వీనర్ గాజుల శ్రీధర్, రంగు ప్రేమ్ శివాజీ, దళిత మోర్చ నాయకులు మోరపల్లి బాలయ్య, యువ మోర్చ ప్రధాన కార్యదర్శి లక్కాకుల రవి, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్, ధర్మపురి ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం



ధర్మపురి అక్టోబర్ 04 (ప్రజామంటలు): లయన్స్ క్లబ్ ధర్మపురి ఆధ్వర్యంలో తేదీ 4-10-2024న వాణివిద్యాలయం ధర్మపురి లో ప్రభుత్వావిప్ ధర్మపురి శాసనసభ్యులు శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని ప్రారంభించటం జరిగింది. మున్సిపల్ ఛైర్పర్సన్ సంగి సత్తమ్మ పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమం లో ధర్మపురి మరియు పరిసర గ్రామాలనుండి 137మందికి పరీక్షలు జరిపి అందులో 44మందికి ఉచిత కంటి ఆపరేషన్ కోసం రేకుర్తి కంటిదవాఖానకు తీసుకువెళ్లడం జరిగింది. ఈ కార్యక్రములో లయన్స్ క్లబ్ అధ్యక్షులు రాపర్తి నర్సయ్య గారు,సెక్రటరీ స్తంభంకాడి రమేష్, ట్రెజరర్ సిరుప రాజన్న, ఆర్.సి. రాజేందర్, జడ్సి ఐ. రామకృష్ణ, డి.సి. జక్కు రవీందర్, పిన్న శ్రీనివాస్, .%ూ%.దినేష్,వొజ్జల మోహన్, బీమానాతి అశోక్, ఈ. వినోదరావు, వెంకటేశ్వర్లు, బి.. మనోహర్ రావు, గట్ల శ్రీనివాస్,మామిడాల రవీందర్,మంతెన శ్రీనివాస్, కట్ట శ్రీహరి, సజ్జరావు, కె. వినయ్, ఆర్. హరినాథ్, పి. శ్రీనివాస్, కె. వెంకటరమణ, పైడి మారుతీ, శ్రీకర్, సాయికృష్ణ, ఆర్. శంకరయ్య, కె. శ్రవణ్, సంగి శేకర్, రామగిరి నరేష్ పాల్గొన్నారు.

# రైతు పక్షపాతి రత్నాకర్ రావు ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్

(రామ కిష్టయ్య సంగన భట్ల)

ధర్మపురి అక్టోబర్ 04 (ప్రజామంటలు): అనునిత్యం రైతుల గురించి ఆలోచించే రైతు బాంధవుడు, రైతు పక్షపాతి జువ్వాడి రత్నాకర్ రావు అని ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్ కీర్తించారు. దివంగత జువ్వాడి రత్నాకర్ రావు 97వ జయంతి సందర్భంగా శుక్రవారం ధర్మపురి క్షేత్రం లోని రత్నాకర్ రావు విగ్రహం వద్ద జయంతి వేడుకలను మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొని జువ్వాడి రత్నాకర్ రావు తనయుడు కృష్ణారావు తో కలిసి రత్నాకర్ రావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.... కీ.శే. రత్నాకర్ రావు తో తనకు ఆత్మీయ అనుబంధం ఉందని, శ్రీధర్ బాబు ద్వారా రత్నాకర్ రావు పరిచయమని, తాను ఎన్నికల్లో ఓటమి చెందినప్పుడు కూడా తనకు ఎంతో ధైర్యాన్ని అందించిన మంచి వ్యక్తి అని, రైతుల అభివృద్ధి, ఏ పంటలు వేస్తే అధిక లాభాలు పొందుతారు, వంటి నిరంతర రైతు గురించి ఆలోచించే గొప్ప నాయకులు రత్నాకర్ రావు అని, ఆయన భౌతికంగా మన మధ్య లేనప్పటికీ ఆయన ఆలోచన విధానం, మనం ఆచరణలో పెట్టినప్పుడే మనం ఇచ్చే ఘన నివాళి అని, అనునిత్యం రైతుల గురించి ఆలోచించే మహానుభావుడు రత్నాకర్ రావు అని, సాగు తాగునీటి కోసం ఆయన చేసిన కృషి చరిత్ర పుటలలో నిలిచిపోతుందని అన్నారు. మున్సిపల్ ఛైర్ పర్సన్ సంగి సత్తమ్మ, పీసీసీ సభ్యులు దినేష్, జువ్వాడి కృష్ణారావు ప్రసంగించిన కార్యక్రమంలో



నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన ధర్మపురి పట్టణానికి చెందిన మల్లికార్జున్ ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం శ్రీవాణి విద్యాలయం మరియు అంగ్లోవేదిక్ కన్వెంట్ హై స్కూల్ యాజమాన్యాల ద్వారా సేకరించిన 65 వేల రూపాయల నగదును లక్ష్మణ్ కుమార్ చేతుల మీదుగా వారి కుటుంబానికి అందజేశారు.

# కాకలు తీరిన రాజకీయ నేత కాకా

## అక్టోబర్ 5...గడ్డం వెంకట స్వామి జయంతి



రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

రాజకీయాల్లో కాకలు తీరిన నేతగా... 'కాకా'గా చెరగని ముద్ర వేసిన కేంద్ర మాజీ మంత్రి, సుదీర్ఘ రాజకీయ అనుభవ శాలి గడ్డం వెంకట స్వామి(92). భారత రాజ్యాంగ రూపకర్త బాబా సాహెబ్ అంబేద్కర్‌తో కలసి పనిచేసిన వారిలో కాకా ఒకరు. కార్మిక నేతగా ప్రస్థానం ప్రారంభించి కాంగ్రెస్ పార్టీలో అంచెలంచెలుగా ఎదిగారు. భారత దేశ అత్యున్నత రాష్ట్రపతి పదవికి అతి సమీపానికి వెళ్ళి, కొందరి స్వార్థం, కుట్రల మూలంగా, ఆ పదవి పొందలేక పోయానని కాకా పదే పదే చెపుతుండే వారు.

హైదరాబాద్ లో ఖాళీ స్థలాల్లో గుడిసెలు వేయించి గుడిసెల వెంకట స్వామిగా గుర్తింపు పొందారు. ప్రాణహిత - చేవెళ్ల ప్రాజెక్టుకు మొదటిసారి ప్రతిపాదన చేసిన వ్యక్తి వెంకటస్వామి. సుదీర్ఘ రాజకీయ జీవితంలో కార్మిక నేతగా, ఎమ్మెల్యేగా, రాష్ట్ర మంత్రిగా, పిసిసి అధ్యక్షుడిగా, ఎఐసిసి బాధ్యునిగా, ఎంపీగా , కేంద్ర మంత్రిగా, ఆయన అందించిన బహుముఖ సేవలు నిత్య జ్ఞాపకాలుగా మిగిలాయి.

గడ్డం వెంకటస్వామి 5 అక్టోబర్ 1929న హైదరాబాద్ లో జన్మించారు. చిన్న వయసులోనే నిజాం వ్యతిరేక పోరాటంలో చురుగ్గా పాల్గొన్నారు. మొదట ఆర్య సమాజ్‌లో, ఆ తర్వాత రామానందతీర్థ శిష్యుడిగా కాంగ్రెస్‌లో పనిచేశారు. సాయుధ పోరాట సమయంలో జైలుకెళ్లిన కాకా.. హైదరాబాద్ విలీనం అనంతరం రాజకీయాలు వదిలేసి కుటుంబ పోషణ కోసం కూలీ పని చేశారు. అప్పుడే కార్మిక నాయకుడిగా ఎదిగారు. హైదరాబాద్‌లో నిలువనీడ లేకుండా ఉన్న పేదల కోసం ఖాళీ స్థలాల్లో గుడిసెలు వేసి వారి కోసం పోరాడారు. ఆర్థికంగా బలపడ్డాక మళ్లీ రాజకీయాల్లోకి వచ్చిన కాకా అనేక పదవులు అలంకరించారు. 1957- 62 మరియు 1978-84 ఆంధ్ర ప్రదేశ్ శాసన సభ్యులుగా రెండు పర్యాయాలు ఉన్నారు. 1967లో 4 వ లోకసభకు ఎన్నికైయ్యారు.1969-71 వరకు ప్రజా పద్దుల కమిటీ సభ్యుడు. అవిభక్త కరీంనగర్ జిల్లా పెద్దపల్లి లోకసభ నియోజకవర్గం నుండ

ి పార్లమెంట్ కు ప్రాతినిధ్యం వహించారు. 1971లో 5వ లోకసభకు (2వ పర్యాయం), 1977లో 6వ లోకసభకు (3వ పర్యాయం), 1989లో 9వ లోక్ సభ (4వ పర్యాయం), 1991లో 10వ లోకసభకు (5వ పర్యాయం), 1996లో 11వ లోకసభకు (6వ పర్యాయం), 2002-2004 అధ్యక్షుడి గా, ఎ.ఐ.సి.సి. ( ఎస్ సి %డ% ఎస్ టి ), 2004లో 14వ లోకసభకు (7వ పర్యాయం), ఎన్నికైయ్యారు. 1978 - 1982 లేబర్ మరియు సివిల్ సప్లైస్, ఆంధ్ర ప్రదేశ్ క్యాబినెట్ మంత్రిగా పని చేశారు. ఫిబ్రవరి 1973 - నవంబర్ 1973 వరకు లేబర్ మరియు పునరావాస కేంద్ర ఉపమంత్రిగా పనిచేశారు.

నవంబర్ 1973-మార్చి 1977 వరకు సప్లై అండ్ రీహాబిలిటేషన్ కేంద్ర ఉపమంత్రిగా పనిచేశారు. 21 జూన్ 1991 నుండి 17 జనవరి 1993 గ్రామీణాభివృద్ధి కేంద్ర మంత్రిగా, 18 జనవరి1993 నుండి ఫిబ్రవరి 1995 టెక్స్టైల్స్ కేంద్ర సహాయ మంత్రి (ఇండిపెండెంట్ ఛార్జ్)గా, 10 ఫిబ్రవరి నుండి 1995-15 సెప్టెంబర్ 1995 వరకు టెక్స్టైల్స్ కేంద్ర క్యాబినెట్ మంత్రిగా, 15 సెప్టెంబర్ 1995 నుండి 10 మే 1996 వరకు



కార్మిక శాఖ కేంద్ర క్యాబినెట్ మంత్రిగా, 20 ఫిబ్రవరి 1996-16 మే 1996 కార్మిక మరియు వస్త్రాల శాఖ కేంద్ర క్యాబినెట్ మంత్రిగా పనిచేశారు. అలాగే డిప్యుటి లీడర్ కాంగ్రెస్ పార్లమెంట్ పార్టి, లోకసభ మెంబర్, కమిటి ఆన్ ఎనర్జి , మెంబర్, కమిటి ఆన్ ఇన్ స్టాలేషన్ ఆఫ్ పోట్రైస్ / స్టేటస్ ఆఫ్ నేషనల్ లీడర్స్, పార్లమెంటేరియన్ ఇన్ పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్ మెంబర్, కమిటి ఆన్ ఎతిక్స్ మెంబర్, కన్ సులేటివ్ కమిటి, మినిస్ట్రీ ఆఫ్ హెవీ ఇండస్ట్రీస్ మెంబర్, స్టాండింగ్ కమిటి ఆన్ ఎనర్జజీ పని చేశారు.

కాకా మొదటి కుమారుడు గడ్డం వినోద్, ఎమ్మెల్యేగా, రాష్ట్ర మంత్రిగా, రెండవ కుమారుడు గడ్డం వివేకానంద, పెద్దపెల్లి నియోజక వర్గానికి ఎం.పి.గా, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహా దారునిగా పనిచేశారు. కాకా 2014, డిసెంబరు 22వ తేదీ హైదరాబాదులో మరణించారు.

## భారతం

బాగవుతుంది ప్రార్ధన స్థలాల్లో
ప్రార్ధన చప్పుడు ప్రాంగణం దాటనపుడు
బాగౌతుంది ప్లాస్టిక్ పరిశ్రమలకి
ప్రభుత్వం పర్మిషన్లివ్వనపుడు
బాగౌతుంది లింగభేదం లేకుండా
ఇంట్లో పన్లు పంచుకున్నపుడు
బాగౌతుంది ప్రభుత్వం విద్య నిర్బంధంగా
అందరికీ అమలుపర్చినపుడు
బాగౌతుంది కర్షకులకి కరెంట్, నీరు
సక్రమంగా అందినపుడు
బాగౌతుంది వైద్యం ప్రతి గడపకు
నాణ్యతగా చేరినపుడు
బాగౌతుంది కోడల్ని, కూతుర్ని
ఒకేరకంగా చూడగలిగినపుడు
బాగౌతుంది దళిత,మహిళ,బాలల్నీ
చక్కగ రక్షించుకోగలిగినపుడు
బాగౌతుంది ఉద్యోగస్తులు విధానాలని
విధిగా అమలుచేసినపుడు
బాగౌతుంది లంచాలు ఇవ్వం, ముట్టం
అని ప్రతివాళ్ళు నిర్ణయించుకున్నపుడు
బాగౌతుంది 'గోమాత'కాదు ప్రతి మాత
ఈ సమాజంలో మనగలిగినపుడు
బాగౌతుంది బాల్యాన్ని ఆదరించి
వృద్ధాప్యాన్ని గౌరవించినపుడు
బాగౌతుంది జీవన విలువల్ని
ఇంటినుండే నేర్పడం మొదలుపెట్టినప్పుడు

భోజన్నగారి అనసూయ
నిజామాబాద్..

## మాయా జూదం

.పేక ముక్కలు
మూడు ముక్కలు
ఆకులు కుదిరితే
ఆస్తులు పెరుగుతాయి
ఆకులు తప్పితే
అప్పులు మిగులుతాయి...

జూదం మంచి వినోదం
దారి తప్పితే దుఃఖ దాయం
అడవులు పట్టవచ్చు
భిక్షాటనకు దారి కావచ్చు...

ఒక వైపు జూదం నిషేదం
ఒక వైపు జూదానికి అనుమతులు
ఇదొక ద్వంద్వ వైఖరి
ఎటుతేలని కిరికిరి
పతనానికి దారి

రేడియమ్
9291527757

## కవితా జిలేబీలు

జిలేబీలనువండుతా
ఘుమఘుమలాడిస్తాజి
కవితలనువ్రాస్తాజి
జివజివలాడిస్తాజి

జిలేబిచూపుతాజి
నోరూరిస్తాజి
కైతను కనమంటా
ఆశనులేపుతా

జిలేబినందిస్తా
ఆనందపరుస్తా
కయితనుచేతికిస్తాజి
మురిసిపొమ్మంటా

జిలేబీనితినమంటా
చప్పరించమంటా
కవనాన్నిచదవమంటా
మధురానుభూతినిపొందమంటా

జిలేబిని తలపించేలాజేస్తా
మరలా తినాలనిపించేలాచేస్తా
కవిత్వాన్ని గుర్తుపెట్టుకొనేలాచేస్తా
పదేపదే పఠించేలాచేస్తా

జిలేబీలు మహారుచి
కవనాలు అంతేరుచి
జిలేబీలు భలేతీపి
కవితలు అంతేతీపి

తినటం మరిగారా
ఇకవదలనే వదలరు
చదవటం అలవాటుపడ్డారా
జీవితంలోనే మరచిపోరు

ఆలశ్యం ఎందుకు
రంగంలోకి దిగండి
జిలేబీలు తినండి
కవితలను చదవండి

చక్కెర వ్యాధున్నా
పరవాలేదు అడ్డంకికాదు
పూర్తిగా అర్ధంకాకున్నా
పక్కవారినడగొచ్చు తెలుసుకోవచ్చు

గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్,
భాగ్యనగరం

## మీ శత్రువుల్ని ప్రేమించండి..!

కొందరు కొందరిని...
మడిలో మట్టిని
కుండల తయారికోసం
కుమ్మరి మట్టిని తొక్కినట్టు
మట్టిలో వేసి త్రొక్కాలని చూస్తారు
కాని...వారు...
"మొలకెత్తే
విత్తనాలని"..వీరికి...తెలియదు

కొందరు
కొందరిపై...
అకారణంగా
నిందలు వేస్తారు
నిప్పులు పెరుగుతారు
ఘాటూగా విమర్శిస్తారు
కసితో విషం చిమ్ముతారు
"ఇటుక రాళ్ళు" విసురుతారు
కానీ వారు...ఆ "రాళ్ళనే మెట్లుగా"
చేసుకొని "ఊహించనంత"...
"ఎత్తుకెదుగుతారని"...
వీరికి...తెలియదు
కొందరు
కొందరిని...
నవ్వించి నమ్మించి
గొంతులు కోసేస్తారు
నీటిలో ముంచేస్తారు
సముద్రంలో తోసేస్తారు
కానీ...వారు...
గజ ఈతగాళ్ళని
ఎంత లోతునీళ్ళలో విసిరినా
రెండు చేతులలో రెండు చేపలతో
"ఒడ్డుకు
చేరుతారని"...వీరికి...తెలియదు

అందుకే ఎవరికీ ద్రోహం చేయకండి..!
"నమ్మక ద్రోహులుగా"...మిగలకండి..!
బద్దశత్రువుల్ని
కూడా"ప్రాణమిత్రులుగా"
ప్రేమించండి.."ప్రేమమూర్తులై"
జీవించండి.

రచన:
"కవి రత్న"
"సహస్ర కవి భూషణ్"
పోలయ్య కూకట్లపల్లి
అత్తాపూర్ హైదరాబాద్
చరవాణి...9110784502

## రాజకీయాలలో వ్యక్తిగత ఆరోపణలు ఆక్షేపనీయం



మంత్రి సురేఖగారిపై ఎక్స్ లో ట్రోలింగ్ చేస్తూ పెట్టిన పోస్ట్ ముమ్మాటికీ తప్పే ! అందరూ రాజకీయాలకు అతీతంగా ముక్తకంఠంతో ఖండించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రాజకీయంలో ఉండే మహిళలపైనే కాదు, సాధారణ మహిళలపై ట్రోలింగ్ చేయడం తప్పే. వాస్తవంగా ట్విట్టర్ (ఎక్స్)లో ఇటువంటి పోస్టులు ఎవరు పెట్టారో వారిమీద చర్యలు తీసుకోవాలి. వారు సామన్యులైనా, రాజకీయ పార్టీలకు చెందిన వారైనా సరే వదలకూడదు. అంతే తప్ప ఒకరిపై ఒకరు వ్యక్తిగత ఆరోపణలు చేసుకోగూడదు. ఒక రాజకీయ పార్టీలలో ఉండే వారిని ప్రజలందరూ గమనిస్తారు. వారు ఎంతో హుందాగా మాట్లాడాలి. రాను రాను రాజకీయ నాయకుల వారి హోదాను మరిచి ఆరోపణలు చేసుకుంటున్నారు. ఇది మంచిది కాదు.

ఈ పోస్టును కేటిఆర్ పెట్టించారనే మంత్రి సురేఖ గారి ఆరోపణ. " మేము పెట్టించలేదు, మాకు ఆ ట్రోలింగ్ పోస్ట్ కు సంబంధం లేదని" బి.ఆర్.యస్ పార్టీ వాదన. హరీష్ గారు ఈ విధంగా ట్రోలింగ్ చేయడాన్ని ఖండించడం మంచిదే. అదే సమయంలో కేటీఆర్ గూడ ఖండిస్తే ఈ సమస్య వచ్చేదే కాదు. సరే అంత వరకూ బాగానే ఉంది. మధ్యలో సురేఖ గారు సినిమా హీరోయిన్ సమంత విషయం తేవడం చాలా తప్పు. కేటీఆర్ మంత్రిగా ఉన్నప్పుడు సినిమా హీరోయిన్ల జీవితాలతో ఆడుకున్నారని, చాలా మంది హీరోయిన్లు ఇబ్బందిపడ్డారని, అందువలనే కొంత మంది హీరోయిన్లు త్వరగా పెళ్ళిచేసుకున్నారని ఆరోపించడం చాలా తప్పు. సమంత విడాకులకు కేటిఆర్ కారణమని బహిరంగంగా ఒక మంత్రి హోదాలో ఉండి ఆరోపణలు చేయడం దారుణం. సోషల్ మీడియాలో ఆమెపైన, మంత్రి సీతక్క, మేయర్ విజయలక్ష్మి పైనా పోస్టులు పెట్టడం బాధాకరమని మంత్రి సురేఖ అనడంలో వాస్తవం ఉంది. ఆమె బాధను మనమందరం ఒప్పుకొని తీరాల్సిందే.

ట్విట్టర్ లో పోస్ట్ కి ఆవిడ ఎంత బాధ పడుతున్నారో అంతే బాధ సమంతాకు కలగదా! అందులోనూ గతంలో ఆవిడ ప్రముఖ కుటుంబానికి కోడలు. వారి వారి మనసులు గాయపడవా? ఈ ఆరోపణలకు ఆధారాలు ఉన్నాయా ? సరే ఒకవేళ ఉంటే దర్యాప్తు చేయలే తప్ప బహిరంగంగా ఇలా మాట్లాడడం మంచి సాంప్రదాయం కాదు. వెంటనే దీనిపైన నాగార్జున ఎంతో ఆవేదనతో ఎక్స్ లో " గౌరవనీయ మంత్రివర్యులు శ్రీమతి కొండా సురేఖ గారి వ్యాఖ్యలని తీవ్రంగా ఖండిస్తున్నాను. రాజకీయాలకు దూరంగా ఉండే సినీ ప్రముఖుల జీవితాలని, మీ ప్రత్యర్థులని విమర్శించేందుకు వాడుకోకండి. దయచేసి సాటి మనుషుల వ్యక్తిగత విషయాలని గౌరవించండి. బాధ్యత గలిగిన పదవి లో ఉన్న మహిళగా మీరు చేసిన వ్యాఖ్యలు, మా కుటుంబం పట్ల మీరు చేసిన ఆరోపణలు పూర్తిగా అసంబద్ధం, అబద్ధం. తక్షణమే మీ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవలిసిందిగా కోరుతున్నాను." పోస్ట్ చేసారు. అలాగా సమంత, నాగ చైతన్య , చాలా మంది ఈ విషయాన్ని ఖండిస్తూ ట్వీట్ చేసారు. ప్రతిపక్షం కూడా హుందాగా ఉండాలి.

అధికారంలో ఉండే మంత్రిపైన, ముఖ్యమంత్రి గారి మీద నిరాధా ఆరోపణలు చేయగూడదు. ఇష్టానుసారం మాటలాడకూడదు. నాయకులుగా ఉండే వారు కొన్ని ఆదర్శాలను, సంప్రదాయాలను పాటించాలి. చట్టపరంగా సురేఖ గారి మీద ట్రోల్ చేసిన వారిని పట్టుకొని శిక్షించాలి. అటువంటప్పుడే ఇటువంటి సంఘటనలు జరగవు. చివరికి మంత్రి కొండా సురేఖ గారు ఆవిడ మాటలను వెనక్కు తీసుకొని క్షమాపణ కోరడం చాలా అభినందనీయం. ఎవరైనా రాజకీయ నాయకులు ముందు వెనుక చూడకుండా ఆరోపణలు చేయడం ఇకనైనా మానాలి. ఎదుట వారి మనసు కూడా మనలాంటిదనే విషయం గుర్తెరగాలి. సభ్య సమాజం తలదించుకునేలా ఆరోపణలు చేయకూడదు. అధికారం ఉన్నపుడు ఒకలా, లేనప్పుడు ఒకలా ప్రవర్తించగూడదు. ప్రతిపక్షంలో ఉన్న బిఆర్ఎస్ కూడా రాష్ట్ర అభివృద్ధికి కావల్సిన సలహాలు ఇవ్వాలి. సామాజిక మాధ్యమాలలో పెట్టిన పోస్టులను ఖండించాలి. అప్పుడే అందరికీ మంచిది. ఈ విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారనే విషయం మరువగూడదు.

జనక మోహన రావు దుంగ
8247045230

## నేనూ నీ కుటుంబమే

నీ నుండి వేరుపడి
నాకు నేనుగా నిలబడి
ప్రతి క్షణం..
తిరుగుతూనే ఉన్నాను నాచుట్టూ
బంధాన్ని వీడలేక నీచుట్టూ!
నీ వెచ్చని చూపులు
స్పృశిస్తూనే ఉన్నాయి నన్ను
అప్పుడప్పుడు
ఉల్కలతో పలుకులు
ప్రేమ వీడక! బంధం మరువక!!
నీది నాది..
తల్లీ బిడ్డల బంధమే!
కర్తవ్య పాలనలో నేను
కన్న ప్రేమతో నీవు!!
దూరంగా ఉన్నా తీరని బంధమే
నేనూ నీ కుటుంబమే!!

జగ్గయ్య.జి
9849525802

## ఆదిపరాశక్తి మనందరికీ నిత్య స్ఫూర్తి



అశ్వయుజం వచ్చింది. మనందరికీ ఆదిపరాశక్తి ని (జగన్మాత)ను కొలిచే అదృష్టాన్ని ఇచ్చింది. అమ్మను కొలిచే ఈ తొమ్మిది రోజులను నవ రాత్రులుగాను,శరదృతువు లో వస్తుంది కనుక శరన్నవ రాత్రులు గాను, దేవిని ఆరాధన చేస్తాము కనుక దేవీ నవ రాత్రులుగాను మనం భావించి పూజించాలి. అత్యంత పవిత్ర మైన శుభ దినాలైన దేవీ నవరాత్రులలో ఆదిశక్తిని ఆరాధించే విధానాన్ని విష్ణు పురాణం, దేవీ త్రిశతి, స్కాంద పురాణం, దేవి భాగవతం లాంటి గ్రంథాలు వివరిస్తున్నాయి. దేవీ నవ రాత్రులలో ఆఅమ్మను మనంవివిధరూపాల్లో ఎలాపూజించాలో తెలుసు కుందాం.

ఈ శరన్నవరాత్రులు చైతన్య స్ఫూర్తి దాయకాలు

అశ్వయిజ పాడ్యమినాడు కలశ స్థాపన చేసి, దేవుని ఆవాహనం చేసి నవమి వరకు పూజలు చేస్తారు. ఈతొమ్మిది రోజులు అన్ని శక్తి పీఠాల్లో, దేవాలయాల్లో, ఇళ్లల్లో ఈ మధ్యకాలంలో నైతే మండపా లలో అమ్మ ఆదిపరాశక్తిని అర్చించడం జరుగుతుంది. అదే మన సంప్రదాయం.

సర్వ మంగళ మాంగళ్యేబీ
శివే సర్వార్ధ సాధికే?
శరణ్యే త్రయంబకే గౌరీబీ
నారాయణి నమోస్తుతే?

చెడును నశింపజేసి మంచిని నెలకొల్పడానికి దానవత్వాన్ని తుంచి, మానవత్వాన్ని స్థాపించడానికి అధర్మం మీద ధర్మం సాధించే విజయానికి క్షేత్రమైన ఈ నవరాత్రులు జగత్తుకు స్ఫూర్తి ని చైతన్యాన్ని కలిగిస్తున్నాయి.

సర్వ దేవతాశక్తుల ఏకరూపమే ఆదిపరాశక్తి అవతారము

యా దేవీ సర్వభూతేషుబీ
శక్తి రూపేణ సంస్థితా?
నమస్తస్యై నమస్తస్యైబీ
నమస్తస్యై నమో నమః

సమస్త ప్రాణికోటిలో శక్తిరూపం గా గోచరించే దేవికి నమస్కారం అని మార్కండేయ పురాణం చెబుతుంది. శక్తి లేని పదార్థం ఏ పని చేయలేదని భాష్యం పేర్కొంటుంది ఈ నామరూపక ప్రపంచం లో ఆపరాశక్తిఉందనియజుర్వేదం చెబుతోంది

అహం బ్రహ్మస్వరూపిణీ
మత్తః ప్రకృతి పురుషాత్మకం
జగత్‌లి నేను బ్రహ్మస్వరూపిణిని
నా వల్లనే ప్రకృతి పురుషాత్మక

జగత్తు అంతా ఉద్భవించిందని దేవి తెలుపుతుంది. అమ్మ అఖి లాండ కోటి బ్రహ్మాండనాయక ఆదిపరాశక్తి ఆదిమధ్యంతరహిత శుద్ధ పర బ్రహ్మ స్వరూపిణి ఆ తల్లి సృష్టి వేళలో సృజన రూప, పాలన వేళలో జగద్రక్షకి, సంహార వేళ రుద్ర రూపిణి. ఆ తల్లి ఇచ్ఛా శక్తి, జ్ఞానశక్తి, క్రియాశక్తి దేవకార్యనిర్వహణార్థం త్రిమూర్తుల దివ్య శక్తులను ఏకోన్ముఖం చేసి సర్వదేవతా శక్తులను కేంద్రీకృతం చేస్తూ చేసిన యజ్ఞంలో చిదగ్నిగుండసంభూతగా ఆవిర్భవించిన దివ్య కాంతిపుంజం. పరమేశ్వరుని శుద్ధమంగళ స్వరూపం జగన్మాత.

దుర్గతి నాశిని, సద్గతి దాయిని ఆ దుర్గమ్మ

జగన్మాత అనంతబాహువులలో సర్వదేవతల ఆయుధాల తేజం చేరింది నహి కారణం వినాకార్యం శివోత్పత్తి కారణం లేకుండా కార్యం కలుగదు కాబట్టి దుష్ట శిక్షణ శిష్ట రక్షణ కొరకు అవతరించిన ఆ శక్తి స్వరూపిణి ఆ మాతృ శక్తి మనకు నిత్యస్ఫూర్తి దాయకం స్వార్థపరత్వం అసూయ ఈర్ష్యా ద్వేషాలను కోపా వేశాలను అనిచి మానవకోటిని సక్రమ మార్గంలో నడిపించే ఆ తల్లి మనకు సన్మార్గదర్శి చెడు నుండి రక్షించే ఆపద్బాంధవి సకల విజయాలకు సంపదలకు మూలస్థానం జగన్మాత.

ఆదిశక్తిని ఆదర్శంగా తీసుకొని జీవిద్దాం!

స్త్రీ శక్తికి ప్రతీక అయిన ఆ తల్లి శుభ నిశుంబులను అణిచి మహిషాసురుని అంతమొందించి లోకాలను ఎలా రక్షించిందో అలాగే ఈ సమాజంలో మనకు ఎదురయ్యే రాక్షస ప్రవృత్తుల నుండి మనల్ని మనం రక్షించుకుందాం. దుర్వ్యసనాలను నాశనం చేద్దాం మనలోని మన చుట్టూ ఉన్న దుర్గుణాలను నశింపజేద్దాం స్త్రీ అంటేనే శక్తి స్వరూపిణి స్త్రీ మూర్తిలో అమ్మ ఉంది ఆ అమ్మే జ్ఞానం ఆ అమ్మే శక్తి ఆ అమ్మే అన్నపూర్ణ ఆ అమ్మే దుర్గాదేవి ఆ అమ్మే మహిషాసురమర్ధిని ఆకలి వేస్తే అన్నం పెడుతుంది అన్యాయం చేస్తే ప్రాణం తీస్తుంది అని ప్రతి ఒక్కరు గుర్తించేలా చేస్తుంది. అమృతత్వాన్ని అమ్మ అవతారాలను అమ్మ రూపాలను తెలియజేసే ఈ ఆశ్వీ ఆశ్రయుజ పాడ్యమి మొదలు నవమి వరకు అమ్మ ఆరాధన వల్ల కలిగే సకారాత్మక శక్తిని ఆ శక్తి ప్రకృతిలో మమేకమై పరాశక్తిగా అందించే శుభతత్వాన్ని స్వీకరిద్దాం! ఆ దుర్గామాతను ఆదర్శంగా తీసుకొని ఆ స్ఫూర్తితో దారిద్ర్యాన్ని దుఃఖాన్ని తరిమికొడదాం! దుర్భిక్షని దుర్వ్యసనాలను నాశనం చేద్దాం! అన్యాయం అత్యాచార అధర్మ అసురీ ప్రవృత్తులను నశింపజేసి ఆ తల్లి స్ఫూర్తితో మనం అన్యాయాన్ని ఎదిరిద్దాం! అత్యాచారాలను అరికడదాం! అధర్మాన్ని దునిమాడుదాం! అసురీ భావాలను అంతం చేద్దాం మన ఆడబిడ్డలను దుర్గలుగా తీర్చిదిద్దుదాం! ఆ పరాశక్తిని భక్తితో కలుద్దాం! అమ్మను అమ్మ శక్తిని ఆదర్శంగా స్వీకరిద్దాం! ఆదర్శంగా జీవిద్దాం! సనాతన భారతీయ ధర్మాన్ని మనం అందరం పరిరక్షిద్దాం!



- చౌదూరి నరసింహారావు,
"సాహిత్య కళా విభూషణ"
ఆధ్యాత్మిక,సామాజిక విశ్లేషకులు

# మంత్రి కొండ సురేఖ చేసిన ఆరోపణలు నిరాధారం

**బి.ఆర్.ఎస్ జిల్లా అధ్యక్షులు విద్యాసాగర్ రావు, మాజీ జెడ్పి చైర్పర్సన్ దావ వసంత**

జగిత్యాల అక్టోబర్ 04 (ప్రజామంటలు):
మంత్రి కొండా సురేఖ చేసిన నిరాధారమైన ఆరోపణలు ఖండిస్తూ బిఆర్ఎస్ పార్టీ జగిత్యాల జిల్లా కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, జిల్లా పరిషత్ తొలి చైర్ పర్సన్ దావ వసంతసురేష్. విద్యాసాగర్ రావు మాట్లాడుతూ.... కొండ సురేఖ కాంగ్రెస్ పార్టీలో వైయస్ హయాంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రి, తర్వాత టి.ఆర్.యస్ లో చేరి మంత్రి, ఇప్పుడు కూడా మంత్రిగా ఉంటూ ఒక మహిళ అయి ఉండి మీ తండ్రి వయసున్న కేసీఆర్ ని కేటీఆర్ మీ తండ్రిని చంపినవా అని అనడం ఒక మంత్రిగా, మహిళ అయి ఉండి సాటి మహిళను కించపరిచే విధంగా వ్యవహరించడం మంచి పద్దతి కాదు. కొండ సురేఖ వ్యాఖ్యలను ఖండిస్తున్నాం. రైతు రుణమాఫీ విషయంలో తుమ్మల మాట్లాడుతూ.... 40 లక్షల మంది రైతుల్లో 20లక్షల మంది రైతులకు చేస్తున్నామని, ఇంకా 20లక్షల మందికి చేయాలనీ మాట్లాడుతున్నారు.. రుణమాఫీ కాక రైతులు ప్రతి రోజు ధర్నాలు చేస్తున్న ఈ ప్రభుత్వానికి చీమ కుట్టినట్టు కూడా లేదని అన్నారు. రుణమాఫీ విషయంలో పాలాభిషేకం చేసుకున్న నాయకులు మీ చిత్తశుద్ధి ఏది అన్నారు. హైడ్రా పేరుతొ ప్రజలను ఇబ్బందులు పెట్టడం సరి కాదన్నారు. ప్రజా సమస్యలను పట్టించుకోకపోవడం 9నెలల పాలన పూర్తి కావస్తుంది. ఇటువంటి దుర్మార్గమైన పాలన ఎక్కడ చూడలేదని పేర్కొన్నారు. రైతు భరోసా ఇంకా ఇవ్వడం లేదన్నారు. జగిత్యాల జిల్లాకు వచ్చిన మంత్రులు ప్రజలు అనారోగ్యంతో, జ్వరాలతో



బాధపడుతున్నారని, విష జ్వరాలతో ప్రజలు, పిల్లలు చనిపోతున్నా పట్టించుకునే వారు లేరని పేర్కొన్నారు.
దావ వసంతసురేష్ మాట్లాడుతూ....జిల్లాలో విజృంభిస్తున్న విషజ్వరాల పై జిల్లా పార్టీ అధ్యక్షులు చెప్పినట్టుగా,కోరుట్ల నియోజకవర్గానికి విచ్చేసిన ప్రజాప్రతినిధులకు మా బిఆర్ఎస్ పార్టీ పక్షాన చిన్న రిక్వెస్ట్ చేస్తున్నాం మీరు వచ్చిన కార్లో ఒక గ్రామానికి కానీ, ఒక వార్డ్ కు గాని వెళ్లి శానిటేషన్ ఎంత అధ్వనంగా ఉందో, ఎంత మంది మరణించారో, ఆసుపత్రిల పాలయ్యారో గల్లి గల్లి తిరిగి తెలుసుకోవాలన్నారు. మీ వ్యక్తిగత ప్రయోజనాల కోసమే మీ పర్యటనల తప్ప వ్యవస్థ బాగుచేయడానికి ముఖ్యమంత్రితో సహా ఏ ఒక్క కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు పనిచేయడం లేదన్నారు. నిన్న కళ్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేసిన స్థానిక ఎమ్మెల్యే కళ్యాణలక్ష్మి పథకం తో పాటు తులం బంగారం అన్న కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీని అబ్బద్ధం అని చెప్పి గెలిచి పార్టీ మారిన ఎమ్మెల్యే మరి ఎంత మందికి తులం బంగారం తెచ్చారో తెలియజేయాలన్నారు. సక్రమంగా రైతు రుణమాఫీ చేయకుండా, పెట్టుబడి సాయం రైతుబంధు ఒక్క రూపాయి అందించకుండా ప్రజల దృష్టిని మర్లిస్తూ నీచమైన పరిపాలను ఇప్పటి ప్రభుత్వం నడుపుతుందన్నారు. కెసిఆర్, కేటీఆర్ బిఆర్ఎస్ పార్టీ వ్యక్తిగతంగా తిడుతూ వారి ప్రతిష్టను దిగజారుస్తూ బాగా తిడితే చాల పెద్దోళం అయితమని ఒక వ్యక్తిగుణం చేస్తున్నారు. పది సంవత్సరాల కెసిఆర్ పాలనను ఆదర్శంగా తీసుకొని వ్యవస్థను బాగుచేయాలన్నారు. తొమ్మిది నెలల ప్రజపాలనలో ఆరు గ్యారెంటీలలో సక్రమంగా ఏ ఒక్క గ్యారెంటీలను కూడా అమలు చేయలేదన్నారు. కవిత హయంలో వారి కృషితో 4500 డబుల్ బెడ్రూం లను ఒక మినీ పట్టణం లాగా అభివృద్ధి చేసి, పట్టణానికి 50 కోట్లు నిధులను తీసుకొచ్చారు. వ్యక్తిత్వం కోల్పోయి వ్యక్తిగత ప్రయోజనాలు మాని వ్యవస్థను బాగుపర్చి కాంగ్రెస్ పార్టీ నాయకులకు మా బిఆర్ఎస్ పార్టీ పక్షాన విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు గట్టు సతీష్, అర్బన్ మండల అధ్యక్షుడు తుమ్మ గంగాధర్, పట్టణ ప్రధాన కార్యదర్శి ఆనంద్ రావు తదితరులు పాల్గొన్నారు.

## జనగామ వీవర్స్ కాలనీలో చేనేత శిక్షణ కేంద్రం ప్రారంభం



జనగామ అక్టోబర్ 04 (ప్రజామంటలు):
చేనేత శిక్షణ కేంద్రాన్ని జనగామ వీవర్స్ కాలనీలో భారత ప్రభుత్వం జౌళి మంత్రిత్వ శాఖ చేనేత అభివృద్ధి కమీషనర్ హెచ్ ఓఓ డాక్టర్ అరుణ్ కుమార్ శిక్షణ కేంద్రం ప్రారంభించారు. పిఆర్ఓ పి.వై. శ్రీనివాస్ మాట్లాడుతూ.... 20 మంది మహిళలకు చేనేత వృత్తి లో మెళకువలను 45 రోజుల పాటు నేర్పించి రోజుకు రూ. 300 భృతి ఇవ్వడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ్ శ్రీనివాస్ పాల్గొని శిబిరంలో పాల్గొంటున్న మహిళలకు అభినందనలు తెలిపారు. చేనేత వృత్తులు కొన్ని ఒడిదుడుకులు ఎదుర్కొంటున్నాయని ప్రభుత్వాలు చేనేత కార్మికులకు అండగా ఉండాలని, జాతీయ అంతర్జాతీయ స్థాయిలో మార్కెటింగ్ అందించేలా కృషి చేయని అన్నారు. ఈ కార్యక్రమం లో శిబిరం శిక్షకులు కోడం నర్సింహలు, సహాయ శిక్షకులు బిర్రు సత్యనారాయణ, ఎనగందుల వెంకటేశ్వర్లు, స్థానికులు బొంతపల్లి నాగరాజు, వంగ యుగేందర్, ఎనగందుల వెంకటేశ్వర్లు, బొంతపల్లి వెంకటేశ్వర్లు, కాముని సమ్మయ్య, పాల్గొన్నారు.



## జనగామ మెటర్నిటీ హాస్పిటల్ లో మైగ్రేషన్ లొల్లి

జనగామ అక్టోబర్ 4 (ప్రజామంటలు):
జనగామ ఎమ్ సీహెచ్ దవాఖాన పేరుకే పెద్ద ఆసుపత్రి కానీ అక్కడికి వెళ్లిన రోగులు కంటతడి పెట్టుకోవాల్సిందే. ఈ క్రమంలోనే ఓ పేషెంట్ పట్ల డాక్టర్లు నిర్లక్ష్యంగా వ్యవహరించిన తీరుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ దవాఖాన అంటే అందరికీ ఉచితం అనే పదం ప్రతి నానుడి అందరి నోటా వినపడుతుంది. కానీ జనగామ మెటర్నిటీ హాస్పిటల్ డాక్టర్లు మాత్రం అందుకు విరుద్ధంగా ఉన్నారు. వివరాలు పరిశీలిస్తే ఉదయం యాదగిరి గుట్టకు చెందిన మిట్ట శృతి అనే గర్భిణీని జనగామ ప్రాంతంలో నివసించే తల్లి జనగామ చంపక్ హిల్స్ లోని మెటర్నిటీ హాస్పిటల్ కు తీసుకొచ్చారు. ఒ.పీ. రాపిస్తున్న తరుణంలో ఆధార్ కార్డు ప్రకారం యాదగిరిగుట్ట అని ఉన్న కారణంగా వేరే జిల్లా నుంచి ఇక్కడికి రావొద్దు మీరు అక్కడే చేయించుకోవాలి అని మహిళను, వారి తల్లిని దుర్భాషలాడుతూ దురుసుగా ప్రవర్తించారు. వారి తల్లి మాది జనగామే, గత కొన్ని నెలల నుంచి కూడా ఇక్కడే చూపించుకుంటున్నాం అని వాదిస్తున్నా వినకుండా ఇక్కడ చూడరు అని డ్యూటీ డాక్టర్ చెప్పడంతో వారు వెంటనే మీడియాను ఆశ్రయించారు. తనతో తన బిడ్డతో వైద్యులు ఇష్టం వచ్చినట్టు వ్యవహరించారని, ఇంకోసారి ఇక్కడికి తీసుకొస్తే బాగుండదు అని డాక్టర్ ఫైల్ మొకం మీదకు విసిరేసిందని తెలిపారు. ఇదేంటని సూపర్డెంట్ ను కలిసినా ఫలితం లేకుండా పోయింది అన్నారు. అలాగే తమతో పాటు కొంత మంది దూరప్రాంత నుంచి వచ్చారని వారిని సైతం అలాగే అన్నారని ఇటువంటి డాక్టర్ల పై చర్యలు తీసుకోవాలని బాధితులు వేడుకున్నారు. దీనిపై సూపరెండెంట్ మధుసూదన్ రెడ్డిని వివరణ కోరగా డాక్టర్ల కొరత ఉందని, పని ఒత్తిడి వల్ల అలా అన్నారని ప్రతి ఒక్కరిని చూస్తామని చెప్పారు.



**శ్రీ దుర్గా భవాని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి**

గొల్లపల్లి అక్టోబర్ 04 (ప్రజామంటలు):
దేవి నవరాత్రుల సందర్భంగా శుక్రవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి గొల్లపెల్లి మండలం లోని శ్రీరాములపల్లె శ్రీ దుర్గా భవాని ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు వారిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముస్కు నిశాంత్ రెడ్డి, మార్కెట్ చైర్మన్ బీమా సంతోష్, వైస్ చైర్మన్ పురపాటి రాజిరెడ్డి, మాజీ ఎంపిటీసీ లంబ ధనవ్వ -లక్ష్మణ్ మాజీ సర్పంచ్ శనిగారపు మల్లేశం, మార్కెట్ డైరెక్టర్ ఓరగంటి తిరుపతి, కిష్టంపేట రమేష్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ విప్ కు వినతి పత్రం అందజేసిన శ్రీ బాలాజీ ట్రాలీ ఆటో యూనియన్ సభ్యులు

గొల్లపల్లి అక్టోబర్ 04 (ప్రజామంటలు):
గొల్లపల్లి మండల శ్రీ బాలాజీ ట్రాలీ ఆటో యూనియన్ సభ్యులు ప్రభుత్వ విప్ ధర్మపురి శాసనసభ్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. శ్రీ బాలాజీ ట్రాలీ ఆటో సంఘ భవనం కొరకు స్థలం మరియు నిధులను మంజూరు చేయాలని వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ముస్కు నిశాంత్ రెడ్డి శ్రీ బాలాజీ ఆటో యూనియన్ అధ్యక్షులు నేరెళ్ల మహేష్, ఉపాధ్యక్షులు తాండ్ర కిరణ్, కోశాధికారి సామల వీరాస్వామి, నర్సయ్య మాణిక్యం, శ్రీనాథ్, శ్రీకాంత్, రాజయ్య, అంజయ్య, శేఖర్ మరియు తదితరులు పాల్గొన్నారు.


# నిత్య శ్రామికులు పారిశుద్ధ్య కార్మికులు

**జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా**

జనగామ అక్టోబర్ 04 (ప్రజామంటలు):
సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా - 2024 ముగింపు కార్యక్రమం శుక్రవారం జిల్లాలోని సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో జరిగింది. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్ తో కలిసి జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. పంచాయతీ కార్యదర్శులతో మల్టీపర్పస్ వర్కర్ లకు ఇన్సూరెన్స్ ప్రక్రియను పూర్తి చేశామని, జిల్లా పంచాయతీ శాఖ ఆధ్వర్యంలో అక్టోబర్ 2 వరకు అన్ని మండలాలకు చెందిన 1200 మల్టీపర్పస్ వర్కర్ లకు ఇన్సూరెన్స్ కల్పించామన్నారు. దీంతో రాష్ట్రస్థాయిలో మల్టీ పర్పస్ వర్కర్లకు ఇన్సూరెన్స్ కల్పించడంలో మొదటి స్థానం సంపాదించామన్నారు. అలాగే స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మెడికల్ క్యాంపులను నిర్వహించామని, క్యాంపులో చూపెట్టుకున్న మల్టీపర్పస్ వర్కర్ లు దాదాపు అందరూ ఆరోగ్యంగా ఉన్నారని, ఇలాగే ఎప్పుడూ ఆరోగ్యం పట్ల శ్రద్ద తీసుకువాలన్నారు. క్యాంపులో విధులు నిర్వహించిన ఆశ వర్కర్ లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, ఏఎన్ఎంలను కలెక్టర్ ఈ సందర్భంగా అభినందించారు. ఉపాధి హామీ పనుల్లో రాష్ట్ర స్థాయిలో జనగామ జిల్లా ప్రథమ స్థానంలో ఉందని, ఇదే స్ఫూర్తిని మున్ముందు కూడా కొనసాగించాలన్నారు. అదే విధంగా స్త్రీ నిధి రుణాల రికవరీకి సంబంధించి 3 కోట్లు వసూలు చేశారని, మిగతా 13 కోట్ల రికవరీ కూడా పూర్తి చేయాలన్నారు. తద్వారా మరిన్ని రుణాలు మహిళలకు అందజేయగలమని, రాష్ట్ర వ్యాప్తంగా స్త్రీ నిధి రుణాల వసూలులో టాప్ పదవ స్థానంలో ఉన్నామన్నారు. ఇందుకు సహకరించిన ఏపీఎంలు, సీసీలను అభినందించారు. అదే విధంగా వచ్చే మూడు నెలల్లో ఎల్ఆర్ఎస్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసిన మండలాల రెవెన్యూ అధికారులను, పంచాయతీ కార్యదర్శులను ఎంపిక చేసి సన్మాన కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. మహిళా శక్తి పథకంలో రాష్ట్రం లో




మన జిల్లా టాప్ నాలుగవ స్థానంలో ఉన్నామని, ఇప్పటివరకు రుణాల రికవరీ ప్రక్రియలో 60 శాతం పూర్తి చేశామని, త్వరలో వంద శాతం పూర్తి చేయాలన్నారు. జిల్లాలోని గ్రామాలను ఆరోగ్యవంతంగా, ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కలెక్టర్ కోరారు. అనంతరం అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) మాట్లాడుతూ.... గత 15 రోజులుగా స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలలో భాగంగా పరిశుభ్రతకు సంబంధించిన 9200 వివిధ రకాల పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహించామన్నారు. విద్యార్థులకు, ప్రజలకు, ఇలా ప్రతీ ఒక్కరికి వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించామన్నారు. జిల్లా లోని ప్రతి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలన్న ఉద్దేశ్యంతో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాల్లో చేపట్టిన ప్రతి కార్యక్రమాన్ని ఎప్పటికి కొనసాగేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అనంతరం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాల్లో పాల్గొన్న వివిధ శాఖలకు చెందిన అధికారులు, విద్యార్థులు, మల్టీపర్పస్ వర్కర్ లు తమ అనుభవాలను తెలియజేశారు. ప్రతీ మండలానికి అయిదుగురు చొప్పున మొత్తం 60 మంది మల్టీపర్పస్ వర్కర్ లను ఎంపిక చేసి, వారిని శాలువాతో సన్మానించి, ప్రశంసా పత్రాలతో ఘనంగా సన్మానించారు. అలాగే స్త్రీ నిధి రుణాల రికవరీకి కృషి చేసిన వీఓలు, ఏపీఎంలను కూడా ఈ సందర్భంగా సన్మానించారు. అంతకుముందు ఉపయోగించి వృథాగా పారవేసే పదార్థాల నుంచి అందమైన, ఉపయోగకరమైన, విలువైన, ఇంట్లో అలంకరణకు ఉపయోగించే వస్తువులుగా తీర్చిదిద్దినందుకు మొదటి బహుమతి కేజీబీవీ నర్మెట, రెండవ బహుమతి జెడ్పీహెచ్ఎస్ దేవరుప్పుల, తృతీయ బహుమతి కేజీబీవీ బచ్చనపేట విద్యార్థులు గెలుపొందారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఈ ముగింపు కార్యక్రమంలో వాటిని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ సరిత, డీపీవో స్వరూప, డిఆర్డిఓ పీడీ వసంత, డిఎంహెచ్ఓ రవీందర్ గౌడ్, ఎస్బీఎం కో - ఆర్డినేటర్ కరుణాకర్, ఎంపీడీఓలు, ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులు, మల్టిపర్పస్ వర్కర్ లు, తదితరులు పాల్గొన్నారు.



కోరుట్ల పట్టణంలో కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ నర్సింగరావు తండ్రి మాజీమంత్రి జువ్వాడి రత్నాకర్ రావు విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎంపీలు వంశీకృష్ణ కిరణ్ కుమార్ రెడ్డి, విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ మరియు వివిధ హోదాలలో ఉన్న నాయకులు

# కనికరం లేని కొడుకులకు, కోడళ్ళకు కౌన్సిలింగ్

**• సమ్మతించి ఒప్పంద పత్రం రాసిచ్చిన కొడుకులు, కోడళ్ళు**



జగిత్యాల అక్టోబర్ 04 (ప్రజామంటలు): కన్నతల్లి, దండ్రులను పోషించక నిరాధరిస్తున్న కొడుకులు, కోడళ్లకు తెలంగాణ ఆల్ సీనియర్ సిటీజేన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్ ఆధ్వర్యంలో అసోసియేషన్ ప్రతినిధులు కౌన్సిలింగ్ చేయడంతో తాము తమ తల్లిదండ్రులను పోషిస్తూ, బాగోగులు చేసుకోవడానికి సమ్మతించి ఒప్పంద పత్రం రాసిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని అసోసియేషన్ కార్యాలయం కౌన్సిలింగ్ కేంద్రంకు ఆ కొడుకులు, కోడళ్లను ఆ తల్లిదండ్రుల అభ్యర్థన పై పిలిపించి వయోవృద్ధుల చట్టం పై అవగాహన కల్పించి, తల్లిదండ్రులను పోషించక నిరాదరణకు గురిచేస్తే ట్రిబ్యునల్ అధికారి అయిన ఆర్డీవో 6 మాసాలకు పైగా జైలు శిక్ష, జరిమానా విధించే వీలు ఆ చట్టంలో ఉందని, మాయ మాటలతో, బెదిరింపులతో వారి ఆస్తులను రిజిస్ట్రేషన్ చేసుకున్నా అట్టి ఆస్తులు తిరిగి ఆ తల్లిదండ్రుల పేరిట మార్పిడి చేసే అధికారం జిల్లా కలెక్టర్ కు ఉందని కౌన్సిలింగ్ చేశారు. జిల్లా కేంద్రానికి చెందిన కనిగరపు మనెమ్మ ను ఆమె పెద్ద కుమారుడు, పెద్ద కోడలు, చిన్న కొడుకు, చిన్న కోడలు పోషించక వేధింపులకు గురి చేస్తున్నారని, సిరిసిల్ల రాజన్న జిల్లా కేంద్రానికి చెంది జగిత్యాల పట్టణంలో అద్దెకు ఉంటున్న వృద్ధ తల్లిదండ్రులు శనిగలపు పోచయ్య, మల్లమ్మ లను జగిత్యాల లోనే వివిధ వృత్తులు చేసుకుంటున్న ఇద్దరు కుమారులు, కోడళ్లు వేధింపులకు గురిచేస్తున్నారని , సీనియర్ సిటీజేన్స్ జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్ కు ఫిర్యాదు చేయడంతో అసోసియేషన్ ప్రతినిధులు హరి ఆశోక్ కుమార్ ఆధ్వర్యంలో గౌరిశెట్టి విశ్వనాథం, వి. ప్రకాశ్ రావు,పట్టణ ఆద్యక్షుడు పి. సతీశ్ రాజ్, ఎం.డి. యాకూబ్ తదితరులు ఆ కనికరం లేని కొడుకులు, కోడళ్లకు కౌన్సెలింగ్ ఇవ్వడంతో వారు ఆ తల్లిదండ్రులను పోషిస్తామని, లేకుంటే తమపై చట్ట ప్రకారము ట్రిబ్యునల్ చైర్మన్ అయిన ఆర్డీవో కు కేసు దాఖలు చర్యలు తీసుకోవాలని ఒప్పంద పత్రం రాసిచ్చారు. ఈ కౌన్సిలింగ్ లో కొడుకులు, కోడళ్లు, తల్లిదండ్రులు, వారి బంధువులు పాల్గొన్నారు.

# రైతు ఐక్య వేదిక ఆధ్వర్యంలో చలో కలెక్టరేట్

## జగిత్యాల జిల్లాలో కదం తొక్కిన రైతన్నలు





జగిత్యాల అక్టోబర్ 04 (ప్రజామంటలు): ఎన్నికలకు ముందు రైతులకు ఇచ్చిన హామీల అమలు కోరుతూ రైతు ఐక్య వేదిక ఆధ్వర్యంలో చలో జగిత్యాల కలెక్టరేట్ నిర్వహించారు. కలెక్టరేట్ వద్ద రైతుల ధర్నాకు జిల్లాలోని అన్ని మండలాల నుండి భారీగా రైతులు తరలివచ్చారు. రైతులకు ప్రభుత్వం రెండు లక్షల వరకు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి గద్దెనెక్కాక హామీల అమలు మర్చిపోయారని అన్నారు. రుణమాఫీకి రైతులకు షరతులు విధిస్తూ రైతుల్ని ఇబ్బందులకు గురిచేస్తూన్నారని రాష్ట్ర వ్యాప్తంగా ఇంకా రుణమాఫీ కానీ రైతులు లక్షల మంది ఉన్న ప్రభుత్వం గందరగోళం సృష్టిస్తున్న నేపథ్యంలో చలో జగిత్యాల కలెక్టరేట్ కార్యకమానికి జిల్లా రైతాంగం తరలి వచ్చింది. వరి ధాన్యానికి క్వింటాల్ కి 500 బోనస్ ఇస్తానని ఇప్పుడు మాట తప్పి కేవలం సన్న వడ్లకే ఇస్తానని అనడం సరికాదని, సన్న వడ్లకు మద్దతు ధర కన్నా మార్కెట్లో అదనంగా ఉందని ప్రభుత్వం సన్న వడ్ల కు బోనస్ ఇస్తామని చెప్పడం హాస్యస్పదంగా ఉందని రైతు నాయకులు అన్నారు.

# బ్రహ్మచారిణి రూపంలో అమ్మవారి దర్శనం

రామ కిష్టయ్య సంగన భట్ల



ధర్మపురి అక్టోబర్ 04 (ప్రజామంటలు): నక్షత్రాలలో మొదటిది అశ్విని కాగా ఆ నక్షత్రమే పూర్ణిమ నాడు ఉండడం వల్ల ఏర్పడిన మాసం ఆశ్వయుజం. అమ్మవారు మహిషుడనే దుష్ట రాక్ష సుడిని, అతని అనుచర రక్కసి గణాన్ని సంహరించడమే నేపథ్యంగా దసరా నవరాత్రులు జరుపుకుంటారు. 9రోజులు జరిగిన పోరులో చెడుపై మంచి, దానవత్వంపై దైవత్యం విజయం సాధించగా, అందుకు ప్రతీకగానే నేటికీ అమ్మవారి ఆలయాలలో ఆచారాలు, అలవాట్లను బట్టి రోజుకో రూపంతో అలంకరించి, పదవ రోజు విజయోత్సవ (విజయ దశమి) వేడుకలు జరుపు కుంటారు. దుర్గాదేవి నవ శక్తులలో ద్వితీయ రూపం బ్రహ్మచారిణిది. బ్రహ్మచారిణి అంటే తపశ్చారిణి. ఆమె రూపం పూర్ణ జ్యోతిర్మయమై, భవ్యమైనది. ఆమె దక్షిణ హస్తంలో జపమాల, వామ హస్తంలో కమండలం ఉంటాయి. అమ్మవారి ఉపాసన వల్ల మానవులలో తపస్త్యాగ వైరాగ్య సదాచార సంయమనాలు వర్ధిల్లుతాయి. జీవితం కఠిన సంఘ ర్షణ వేళల్లో కూడా సాధకుని మనస్సు విచలితం కాదు. బ్రహ్మచారిణీ దేవివల్ల సాధకునకు సర్వే సర్వదా సిద్ధి, విజయాలు లభిస్తాయి. ఈరోజున సాధకుని మనస్సు స్వాధిష్ఠాన చక్రంలో ఉంటుంది. స్థిర మనస్కుడైన యోగి ఈ తల్లి భక్తిని పొంది, ఈమె కటాక్షానికి పాత్రు డౌతాడు. రెండవ రోజున ధర్మపురి క్షేత్రస్థ శ్రీరామలింగేశ్వరస్వామి వారి ఆలయం (శివాలయం) లో దసరా (దేవి) నవరాత్రుల ఉత్సవములలో భాగంగా రెండవ రోజు ఉదయము 9.30 గం.లకు వేదపండితులు, ఋత్వికులచే మహా సంకల్పము, పృధ్వీ, కలశ, గణపతి పూజ, స్వస్తిః పుణ్యాహ వచనము, ఋత్విక్ వరణము, అఖండ దీప స్థాపన, నవగ్రహ, వాస్తు, క్షేత్ర పాలక, యోగిని, అంకురారోపణ, మాతృక, సర్వతోభద్ర మండల పూజలతో ప్రధాన కలశ స్థాపనలు జరిగాయి. ఇందులో భాగంగా సప్తశతీ పారాయణము, అమ్మ వారికి చతుషష్ఠి పూజ, శ్రీ చక్రమునకు కుంకుమార్చన, హారతి, మంత్రపుష్పము, కన్యకా, సువాసిని పూజలు, తీర్థ ప్రసాద వితరణలు గావించారు. రెండవ రోజు శుక్ర వారం అమ్మ వారు 'బ్రహ్మచారిణి" పసుపు రంగు చీరలో మల్లెపూలు, బిల్వపత్రి దండలు దరించి భక్తులకు దర్శనం కలిగించారు. దేవస్థాన ఏసీ ఈఓ సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ డి.కిరణ్, వేదపారాయణ దారులు బొజ్జ రమేష్ శర్మ, సిహెచ్. ముత్యాల శర్మ, భరత్ శర్మ, పాలెపు ప్రవీణ్ శర్మ, ఉపప్రధాన అర్చకులు నేరళ్ళ శ్రీనివాసాచార్యులు, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచార్యులు, సిహెచ్ రమణయ్య, అర్చకులు ద్యావళ్ళ విశ్వనాథ శర్మ, బొజ్జ సంతోష్ కుమార్, బొజ్జ రాజగోపాల్, ఋత్వికులు నంబి అరుణ్ కుమార్, పాలెపు సందీప్ శర్మ, ద్యావళ్ళ సాయి శర్మ మరియు భక్తులు అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం శ్రీ యోగ, ఉగ్ర నృసింహస్వామి వార్ల ఊరేగింపు సేవ "గజవాహనంపై పురవీధులలో తిరిగి దేవాలమునకు తిరిగి వచ్చారు. సాయంత్రం 6.30 గంటల నుండి రాత్రి 7.30 గంటల వరకు శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారికి షోడషోపచార పూజతో ' హారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ జరుపబడినవి. పట్టణంలో నూతన తి తి దే కళ్యాణ మండపంలో నవదుర్గ సేవా సమితి ధర్మపురి ఆధ్వర్యంలో లోక కళ్యాణార్థమై నిర్వహించే శ్రీ దుర్గా శరన్నవరాత్రోత్సవాలలో భాగంగా శ్రీ బ్రహ్మచారిణి దుర్గా అలంకరణ రూప అమ్మవారికి చతుష్షష్టి పూజ, మంత్రపుష్పం, మంగళ నీరాజనం విశేష పూజలను వేద పండితులు కాసర్ల వంశీకృష్ణ శర్మ అర్చకత్వంలో జన్మంచి వంశీకృష్ణ, కసోజ్జుల బాలకృష్ణ శర్మలు నిర్వహించారు. నర్మదేశ్వర మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కమిటీ సభ్యులు కార్యక్రమాలు నిర్వహించారు. దుర్గాదేవి బ్రహ్మచారిణి రూపంలో భక్తులకు దర్శనమిచ్చింది.

# పద్మశాలి భవన నిర్మాణం కోసం శంకుస్థాపన చేసిన కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్



కోరుట్ల అక్టోబర్ 04 (ప్రజామంటలు): జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణ పద్మశాలి సంఘ భవన నిర్మాణం కోసం శంకుస్థాపన చేసిన కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ మరియు జగిత్యాల జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు. కోరుట్ల పట్టణంలో పద్మశాలి భవన నిర్మాణానికి 50 లక్షల నిధులు బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంజూరు కాగా, వారికి ప్రభుత్వ భూమిని కూడా అందించి, ఆ యొక్క భవన నిర్మాణానికి ఈరోజు కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్. మరియు జగిత్యాల జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ మాట్లాడుతూ.... కొండ లక్ష్మణ్ బాపు మనందరికీ ఆదర్శప్రాయులని, నేతన్నలకు మంచి రోజులు రావాలని ఆయన కోరారు. రాష్ట్ర ప్రభుత్వం చేనేత వస్త్రాల ఉత్పత్తిని ప్రోత్సహించాలని, గతంలో కేసీఆర్ నేతన్నల ఆత్మహత్యలు ఆగాలని తీవ్ర కృషి చేశారని ఆయన గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు కోరుట్ల పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షులు, గుంటుక ప్రసాద్, జగిత్యాల జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షులు రుద్ర శ్రీనివాస్, గుంటుక సాంబమూర్తి, చాప కిశోర్,బాలే నర్సయ్య, గడ్డం మధు, జక్కుల ప్రసాద్, ఎక్కలదేవి నవీన్,జిల్లా ధనుంజయ్, మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతి, ఏ.ఇ. జగదీశ్వర్, సంఘ సభ్యులు, పద్మశాలి కుల బాంధవులు తదితరులు పాల్గొన్నారు.

# ముస్లింల అభివృద్ధికై కార్యాచరణ ప్రారంభిస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు




కరీంనగర్ అక్టోబర్ 04 (ప్రజామంటలు): మైనారిటీ నేతలతో సమావేశం ఏర్పాటు చేసి, సమస్యలపై స్పందించిన జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్ కు జిల్లా మైనారిటీల పక్షాన ధన్యవాదాలు తెలిపారు. ఇటీవల హైదరాబాద్ సచివాలయం వేదికగా ముస్లిం మైనారిటీల సంక్షేమం కోసం కృషి చేస్తామని రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గారు హామీ ఇచ్చిన నేపథ్యంలో నేడు కరీంనగర్ డిసిసి కార్యాలయంలో కరీంనగర్ మాజీ వక్ఫ్ బోర్డు చైర్మన్ ఎస్. ఏ. మోసీన్ ఆధ్వర్యంలో పలువురు మైనారిటీ నేతలతో కలిసి పత్రిక విలేకరుల సమావేశం మాట్లాడుతూ.... అక్టోబర్ 1న రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన హైదరాబాద్ లోని సచివాలయంలో ముస్లిం ప్రముఖులు కరీంనగర్ మాజీ వక్ఫ్ బోర్డు చైర్మన్ ఎస్.ఏ. మోసీన్, మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమీ, మాజీ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మజర్ మొహియుద్దీన్, అబుబకర్ ఖాలీ, ఫసియుద్దిన్ నవాబ్, తదితర నేతలు మరియు మైనారిటీ సంక్షేమ శాఖ ఉన్నతాధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ముస్లిం మైనారిటీల సర్వతో ముఖాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలుపదాన్ని మైనార్టీ నాయకులు అభినందించారు. నిర్వహించిన సమావేశంలో జిల్లాలోని మైనారిటీ సమస్యలపై స్పందించడంతో పాటు ఇతర జిల్లాల నుంచి రాజధాని నగరానికి వచ్చి పోటీ పరీక్షల కోసం సన్నద్ధమయ్యే ముస్లిం విద్యార్థులకు ఆధునిక వసతులతో హాస్టల్స్ ఏర్పాటు చేస్తామని, రాష్ట్రవ్యాప్తంగా ఉర్దూ మీడియం పాఠశాలలను బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ప్రధానంగా కరీంనగర్ జిల్లాకు సంబంధించి నగరంలో మైనారిటీ స్టడీ సర్కిల్ ఏర్పాటు, ఒక బోర్డు కు సంబంధించిన షాపింగ్ కాంప్లెక్స్, కమ్యూనిటీ భవన నిర్మాణం, ఆక్రమణకు గురైన ఖాజీపూర్ లోని 55 ఎకరాల వక్ఫ్ బోర్డు భూములపై విచారణ చేపట్టి తిరిగిఆ భూములను వక్ఫ్ బోర్డ్ కు అప్పగించి పర్యవేక్షించడం తదితర అంశాలపై మంత్రి పొన్నం ప్రభాకర్ గారు హామీ ఇచ్చిన ఇచ్చినందుకు కరీంనగర్ జిల్లా ముస్లిం మైనారిటీల పక్షాన, మరియు కాంగ్రెస్ పార్టీ పక్షాన మంత్రి పొన్నం ప్రభాకర్ గారికి, రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాం అని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు హాజీ భాయ్, నగర కాంగ్రెస్ మైనారిటీ సెల్ అధ్యక్షులు హైమద్, కరీంనగర్ రూరల్ మండలం మైనార్టీ సెల్ అధ్యక్షుడు శబాజ్ ఖాన్, బొమ్మకల్ ఎంపీటీసీ పాషా, తదితరులు పాల్గొన్నారు.

# బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి జువ్వాడి రత్నాకర్ రావు



కోరుట్ల అక్టోబర్ 04 (ప్రజామంటలు): రాష్ట్రంలో ప్రతి గుడిలో దీప దూప,నైవేద్యం ఉండాలన్న గొప్ప ఆశయంతో జువ్వాడి రత్నాకర్‌రావు ఆ కార్యక్రమాన్ని ప్రారంభించారని అది నేటికీ కొనసాగుతుందని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలోని వెటర్నరీ కళాశాల ముందు జువ్వాడి నర్సింగరావు ఏర్పాటు చేసిన ఆయన తండ్రి జువ్వాడి రత్నాకర్ రావు విగ్రహాన్ని ఈరోజు శ్రీధర్ బాబు ఆవిష్కరించారు. అనంతరం ముక్కాస్ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తన రాజ కీయం ఎలా జరిగిందో అందరికి తెలుసని తన తండ్రి మృతి చెందడంతో జువ్వాడి రత్నాకర్ రావు అప్పటి పిసిసి అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి, జీవన్ రెడ్డి పోద్బలంతో రాజకీయాల్లోకి వచ్చానని, ఐదు మార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది వారు చూపిన బాటలో నడుస్తున్నానని ఆయన అన్నారు. ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చిన గొప్ప వ్యక్తిగా రత్నాకర్ రావు ఎంతో క్రమశిక్షణతో రాజకీయాల్లో చెరగని ముద్ర వేశారని అన్నారు. రైతు నేతగా ప్రజల మన్ననలు పొందిన వ్యక్తిగా రత్నాకర్ రావు నిలిచాడని ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేశారని ఆయన అన్నారు, రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాలు బాగుంటే రాష్ట్రం బాగుపడు తుందని ఆలోచించిన ఏకైక వ్యక్తి రత్నాకర్ రావు అని ఆయన చూపించిన బాటలో ముందుకు వెళ్తున్నామని ఆయన అన్నారు. ఏ కష్టం వచ్చినా పేదలకు బాసటగా నిలిచిన వ్యక్తిగా ఆయన పేరు గాంచారని అన్నారు. ఆయన వెంట ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ప్రభుత్వ విప్‌లు అట్లూరి లక్ష్మణ్ కుమార్, ఆది శ్రీనివాస్, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్, కోరుట్ల నియోజకవర్గం ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

# అంటువ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలి

## వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ఫర్వానుద్దిన్




జమ్మికుంట అక్టోబర్ 04 (ప్రజామంటలు): జమ్మికుంట మున్సిపల్ ఏరియాలో వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ఫర్వానుద్దున్ ఆధ్వర్యంలో 16వ వార్డులో వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. ఈ వైద్య శిబిరంలో 51 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేయడం జరిగినది. నలుగురు జ్వర పీడితులకు ఆర్.డీ.టి. కిట్స్ ద్వారా డెంగీ మరియు మలేరియా వ్యాధులకు సంబందించిన పరీక్షలు నిర్వహించడం జరిగినది. అదేవిధంగా 29 వ వార్డులో డాక్టర్ చందన గారి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించి 44 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేయడం జరిగినది. ఇద్దరు జ్వర పీడితులకు ఆర్ డీ టి కిట్స్ ద్వారా మలేరియా మరియు డెంగీ పరీక్షలు చేయడం జరిగింది. ఈ రెండు వైద్య శిబిరములకు వచ్చిన ప్రజలకు అసంక్ర మిత వ్యాధులు మధుమేహం, రక్త పోటు పరీక్షలు నిర్వహించి, అవసరం ఉన్న వారికి తగిన మందులు ఇవ్వడం జరిగినది. సీజనల్ వ్యాధులు వ్యాపించు విధానం, వ్యాధుల లక్షణాలు, తీసుకోవలసిన జాగ్రత్తలను క్లుప్తంగా వివరించి చెప్పినారు. వ్యక్తి గత పరిశుభ్రత మరియు పరిసరాల పరిశుభ్రత పై అవగహన కల్పించనైనది. ప్రతి మంగళవారం మరియు శుక్రవారం ప్రతిఒక్కరు డ్రై డే పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమములో డాక్టర్ ఫర్వానుద్దీన్, డాక్టర్ చందన, హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్ రెడ్డి, హెల్త్ సూపర్ వైజర్స్ అరుణ, రత్న కుమారి, హెల్త్ అసిస్టెంట్ నరేందర్, 16 వార్డ్ మరియు 29 వార్డ్ కౌన్సిలర్స్ ఉతాడి రాజయ్య, రావి కంటి రాజకుమార్ మరియు ఏఎన్.ఎం.ఎస్. వాణిశ్రీ, రాధ, సజీదా పర్వీన మరియు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఇందిరా మహిళా శక్తితో మహిళల ఆర్థికాభివృద్ధి

## ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్





జగిత్యాల అక్టోబర్ 04 (ప్రజామంటలు): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా జగిత్యాల పట్టణం 16వ వార్డులో పొరండ్ల గ్రామ శ్రీ సాయి స్వశక్తి మహిళ సంఘం సభ్యుల ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మి బోటిక్, లేడీస్ క్లాత్ హౌస్ ను, 37వ వార్డులో వెల్దుర్తి గ్రామ అరుందతి స్వశక్తి సంఘం ఆధ్వర్యం లో శ్రీ కృతి ఎంబ్రాయిడరీ లేడీస్ టైలర్ షాప్ ను ప్రారంభించిన జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ , మున్సిపల్ చైర్మన్ అడువాల జ్యోతి లక్ష్మణ్. ఎమ్మెల్యే మాట్లాడుతూ.... ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాల ద్వారా మహిళ సంఘాల సభ్యులు ఆర్థికంగా అభివృద్ధి చెందడం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని, అందులో భాగంగా మహిళా సంఘాల వారికి బ్యాంకుల ద్వారా రుణాలు అందించి, వాటి ద్వారా వారు ఆయా ఆదయాభివృద్ధి కార్యక్రమాలు చేసుకునేలా తద్వారా వారు ఆర్థికంగా ఎదిగేలా కృషి చేయడం జరుగుతుందని జగిత్యాల శాసన సభ్యులు డా.సంజయ్ కుమార్ అన్నారు. మహిళలు నూతన మెలకువలు నేర్చుకొని, సమాజంలో కార్పొరేట్ స్థాయి వ్యాపారాన్ని తట్టుకొని అభివృద్ధి చెందాలని, నిరంతరం నేర్చుకోవడం, సాధన ద్వారా సాధ్యపడుతుంది అని అన్నారు. సమాజంలో ప్లాస్టిక్ నిర్మూలన మహిళల తో సాధ్యం అన్నారు.

మహిళ సంఘాల స్టీల్ బ్యాంక్ ఏర్పాటు చేయటం ద్వారా సమాజ సేవతోపాటు, లాభార్జన సాధ్యం అని అన్నారు. మహిళల ఆర్థిక అభివృద్ధికి, సహకారం కు తన వంతుగా పూర్తి మద్దతు ఉంటుంది అని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం, ఎపిఎం గంగాధర్, కౌన్సిలర్ లు కూతురు రాజేష్, కూసరి అనిల్, తోట మల్లికార్జున్, క్యాదాసు నవీన్, పిట్ట ధర్మరాజు, అల్లే గంగ సాగర్, నక్కల రవీందర్ రెడ్డి, గంగారెడ్డి నాగిరెడ్డి, బుర్ర ప్రవీణ్, ఆనంద్ రావు, ఎర్ర నర్సయ్య, శ్రీరామ్ భిక్షపతి, రామకృష్ణ రెడ్డి, ఆడెపు సత్యం, శేఖర్, గుంటి రవి, నక్క హరీష్, తిరుపతి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# సర్వరాజుపల్లి గ్రామంలో డిజిటల్ ఫ్యామిలీ హెల్త్ కార్డులు సర్వే లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్

కోరుట్ల అక్టోబర్ 04 (ప్రజామంటలు): రాష్ట్ర అత్యంత ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా చేపట్టిన డిజిటల్ హెల్త్ కార్డులు సర్వేలో భాగంగా శుక్రవారం రోజున జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం సర్వరాజుపల్లి గ్రామంలో జిల్లా కలెక్టర్ ఇంటింటా సర్వేలో అధికారులతో కలిసి పాల్గొన్నారు. డిజిటల్ ఫ్యామిలీ హెల్త్ కార్డులకు కుటుంబ వివరాలు పక్కాగా నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం గ్రామంలోని ప్రతి ఇంటిని పరిశీలిస్తూ కుటుంబం నిర్ధారణ వివరాలను ఎలాంటి తప్పులు లేకుండా పక్కాగా నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాస్, తహసిల్దార్, ఎంపిఓ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సర్వరాజ్ పూర్ లో జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్



కోరుట్ల అక్టోబర్ 04 (ప్రజామంటలు): కోరుట్ల మండలం సర్వరాజ్ పూర్ గ్రామంలో ఫ్యామిలీ డిజిటల్ కార్డ్ సర్వేను పరిశీలించిన జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్. తప్పులు లేకుండా ప్రతి ఒక్క కుటుంబాన్ని జాగ్రత్తగా నమోదు చేయాలని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డివో నక్క శ్రీనివాస్, ఎంపీడీవో వోదెల రామకృష్ణ, ఎంపీఓ దొండ కృపాకర్, గ్రామ పంచాయతీ సెక్రెటరీ మాధవి మరియు టీం సభ్యులు పాల్గొన్నారు.




# ఎస్ఎఫ్ఐ జనగామ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలు

జనగామ అక్టోబర్ 04 (ప్రజామంటలు): ఎస్ఎఫ్ఐ జనగామ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలు కార్యాలయం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎస్ఐ జిల్లా గర్ల్స్ కన్వీనర్ దాసగానీ సుమా, జిల్లా కార్యదర్శి ధర్మభిక్షం మాట్లాడుతూ.... బతుకమ్మ మహిళలు జరుపుకునే పండుగ అని అన్నారు. ప్రస్తుతం అమ్మాయిలపై జరుగుతున్న అఘాయిత్యాలను ఖండించారు. కాంగ్రెస్ ప్రభుత్వం లో మహిళలపై అఘాయిత్యాలు లైగింక దాడులు ఎక్కువ అయ్యాయని అన్నారు. విద్యార్థినులపై కొందరు కామాంధులు అఘాయిత్యాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. కొమురవెల్లి లో జనగామ లో జరిగిన సంఘటన చాలా బాధకరం అని అన్నారు. వెంటనే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంత్రి కొండ సురేఖ హీరోయిన్ సమంత పై అనుచిత వ్యాఖ్యలు చేయటం సరికాదు. గౌరవప్రదమైన పదవిలో మహిళా మంత్రిగా ఉండి ఇంకో మహిళ పైన అసభ్యకరమైన వ్యాఖ్యలు చేయటం సరి కాదని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు లవకుమార్, రమేష్, ఆర్య మురళి, మానస, ధన్వంతి, సురేఖ, కీర్తన పాల్గొన్నారు.





# భజన మందిరానికి భూమి పూజ చేసిన ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్ పర్సన్

జగిత్యాల అక్టోబర్ 04 (ప్రజామంటలు): పట్టణములోని హనుమాన్ వాడ భీరయ్యా స్వామి దేవాలయం లో ఎమ్మెల్యే కృషితో టీటీడీ ద్వారా మంజూరైన 10లక్షల రూపాయల నిధులతో భజన మందిరం నిర్మాణానికి భూమి పూజ చేసిన శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ .అంతకుముందు ఆలయం లో భీరయ్య స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు ఎమ్మెల్యే.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ని సత్కరించిన కురుమ సంఘం పెద్దలు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అడువాల జ్యోతి లక్ష్మణ్, వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం, కౌన్సిలర్లు కోరే గంగమల్లు, తోట మల్లికార్జున్, కూతురు రాజేష్, కూతురు పద్మ, పిట్ట ధర్మరాజు, కూసరి అనిల్, బద్దం లత జగన్, క్యాదాసు నవీన్, సంఘం అధ్యక్షుడు పుల్ల మల్లయ్య, కార్యదర్శి పుల్ల మహేష్, సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ లోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో పూజా కార్యక్రమాన్ని నిర్వహించిన కరీంనగర్- నిజామాబాద్- అదిలాబాద్- మెదక్ పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ అభ్యర్థి "అల్ఫోర్స్" డా. వి. నరేందర్ రెడ్డి మరియు ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు



# దసరా పండుగ వస్తుంది, జీతాలు ఇవ్వండి

## కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ కు విజ్ఞప్తి

కరీంనగర్ అక్టోబర్ 04 (ప్రజామంటలు): గత రెండు నెలలుగా ప్రభుత్వ ఆసుపత్రిలో పని చేస్తున్న షానిటేషన్, పేసెంట్ కేర్, సెక్యూరిటీ గార్డ్స్ కార్మికుల జీతాలు పెండింగ్. కార్మికుల పెండింగ్ జీతాలు ఇవ్వండని వినతి, దసరాకు కార్మికులు పస్తులు ఉండాలా? హాస్పటల్ సూపరిండెంట్ ఆర్.ఎమ్. నవీన కు వినతి పత్రం అందజేసిన సిబ్బంది.

# సీనియర్ సిటీజేన్స్ ఆధ్వర్యంలో ప్రపంచ నవ్వుల దినోత్సవం



జగిత్యాల అక్టోబర్ 04 (ప్రజామంటలు): తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్ ఆధ్వర్యంలో ప్రపంచ నవ్వుల దినోత్సవం నిర్వహించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని అసోసియేషన్ కార్యాలయంలో ఈ సందర్భంగా నవ్వుల పోటీలు నిర్వహించారు. పలువురు సీనియర్ సిటిజెన్లు తమ జోక్స్, హాస్య ప్రదర్శనలు చేస్తూ కడుపుబ్బ నవ్వించారు. ఈ పోటీల్లో మొదటి బహుమతి దిండిగాల విఠల్, రెండో బహుమతి దుబ్బేశ్,మూడో బహుమతి విజయలక్ష్మి, కన్సోలేషన్ బహుమతి ఎం.డి. యాకూబ్ హుస్సేన్ లకు రిటైర్డ్ జాయింట్ కలెక్టర్ కందుకూరి కృష్ణా రెడ్డి, హరి అశోక్ కుమార్ లు కిరీటధారణ చేసి పురుషులకు నవ్వుల రారాజు, మహిళలకు నవ్వుల మహారాణి అవార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి విష్వనాథం, ఉపాధ్యక్షులు పి.సి. హన్మంత్ రెడ్డి, ఎం.డి. యాకూబ్,కోశాధికారి వెల్ముల ప్రకాష్ రావు, దిండిగాల విఠల్, సత్యనారాయణ, దేవేందర్ రావు, పబ్బా శివానందం, బి. రాజేశ్వర్, నారాయణ, హరి ప్రసాద్ యాదవ్, భాస్కర్ రావు, కస్తూరి శ్రీమంజరి, గంగం జలజ, విజయలక్ష్మి, సింగం పద్మ తదితరులు పాల్గొన్నారు.



## గాయత్రి బ్యాంకు ద్వారా మంజూరైన చెక్కును అందించిన ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్

కోరుట్ల అక్టోబర్ 04 (ప్రజామంటలు):
కోరుట్ల పట్టణానికి చెందిన ఎండి సాజీద్ అలీ ప్రమాదవశాత్తు మరణించగా మృతుడికి గాయత్రి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ యందు గల "నిర్భయ సేవింగ్ ఖాతా" పై గల ప్రమాద భీమా సౌకర్యం ద్వారా మంజూరైన ఒక లక్ష రూపాయల విలువ గల చెక్కును వారి కుటుంబ సభ్యులకు కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అందజేశారు..



## రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

### డిజిటల్ కార్డుల సర్వేను పకడ్బందిగా నమోదు చేయాలి

జగిత్యాల అక్టోబర్ 04 (ప్రజామంటలు):
జిల్లాలో పర్యటించిన హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ స్పెషల్ ఆఫీసర్ ఆర్.వి. కర్ణన్ రోగులకు మెరుగైన వైద్యం అందించాలని జగిత్యాల జిల్లా స్పెషల్ ఆఫీసర్ ఆర్.వి. కర్ణన్ తెలిపారు. శుక్రవారం మాత శిశు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ బి, సత్య ప్రసాద్ తో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులకు అందిస్తున్న వైద్య సేవలు గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. డంపింగ్ యార్డ్ చెత్తను ఎక్కడికి తరలిస్తున్నారు అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్మాత్మకంగా చేపట్టిన డిజిటల్ ఫ్యామిలీ సర్వేలో భాగంగా పట్టణంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీ మరియు రూరల్ మండలం అంతర్గాం ఓడ్డెర కాలనీ జరుగుతున్న సర్వేలో స్వయంగా పాల్గొన్నారు. ఈ సందర్భంలో అధికారులతో స్పెషల్ ఆఫీసర్ మాట్లాడుతూ, కుటుంబ నిర్ధారణ వివరాలు తప్పులు లేకుండా పకడ్బంధిగా నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్, ఆర్డీవో శ్రీనివాస్, డిఎంహెచ్ఓ డాక్టర్ సమియుద్దీన్, తహసిల్దార్, ఎంపీడీవో, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ భక్తాంజనేయ దేవస్థానంలో విజయ దుర్గా సేవాసమితి ఆధ్వర్యంలో కుంకుమ పూజలు



గొల్లపల్లి అక్టోబర్ 04 (ప్రజామంటలు):
మండల కేంద్రంలో శ్రీ భక్తాంజనేయ స్వామి దేవస్థానంలో విజయ దుర్గ సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ దుర్గా శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా రెండవ రోజు అమ్మవారు శ్రీ బాలత్రిపుర సుందరి దేవి అవతారములో భక్తులకు దర్శనం ఇచ్చారు వేద పండితులు శ్రీ తిరుణహరి సత్యనారాయణ ఆచార్యులు బ్రహ్మశ్రీ భాస్కరాచార్యులచే మొదటగా స్థాపిత దేవతల పూజ మహా పూజ తీర్థ ప్రసాద వితరణ రుద్రాభిషేకం నిమ్మకాయలతో అలంకరణతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భవానీలు నిమ్మకాయలతో ప్రత్యేక అలంకరణ చేశారు అమ్మవారికి భక్తులు నైవేద్యంగా మక్క గారెలు, పులిహోర, ప్రసాదంగా సమర్పించారు సాయంకాలం మహిళలు చే కుంకుమార్చన చేయించారు హారతి మంత్రపుష్పం తీర్థ ప్రసాదం భక్తులందరికీ అందజేశారు ఈ కార్యక్రమంలో భవాని దీక్షపరులు పాల్గొన్నారు.

## గాయత్రి మాత అలంకరణలో దుర్గ అమ్మవారు

గొల్లపల్లి అక్టోబర్ 04 (ప్రజామంటలు):
గొల్లపల్లి మండలంలోని భీమ్రాజు పల్లి గ్రామంలో దుర్గాదేవి గాయత్రి మాత అలంకరణలో దర్శనమిచ్చారు. బ్రహ్మశ్రీ తిప్పర్తి సత్యచర్యులు ప్రత్యేక పూజలు చేశారు. దంపతులు నిత్య పూజ,మాతలు కుంకుమార్చన పూజలు చేశారు. ఈ కార్యక్రమంలోభవాని దీక్ష స్వాములు, అభయాంజనేయ స్వామి ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## డిఎస్సి 2024 కు 1:3 నిష్పత్తిలో ఎంపికైన అభ్యర్థులకు ధృవ పత్రాల పరిశీలనకు నేడే చివరి రోజు

జనగామ అక్టోబర్ 04 (ప్రజామంటలు):
మూడవ రోజు జనగామ జిల్లా కేంద్రంలోని ప్రిస్టెన్ పాఠశాలలో డీఎస్సీ 2024 నియామకంలో భాగంగా స్కూల్ అసిస్టెంట్ , భాషోపాధ్యాయ, సెకండరీ గ్రేడ్ టీచర్ విభాగంలలో నోటిఫికేషన్ లో పేర్కొన్న పోస్టుల కు 1:3 నిష్పత్తిలో ఎంపికైన అభ్యర్థుల నిజ ధ్రువపత్రాల పరిశీలన జరుగుతున్న తీరును జిల్లా విద్యాశాఖ అధికారి కే. రాము పరిశీలించారు. ఈనెల 5 శనివారం నేడే పరిశీలనకు చివరి రోజు అని, ఇప్పటి హాజరు కానీ అభ్యర్థులందరూ తప్పకుండా చెక్లిస్ట్ తో పాటు రెండు సెట్ల జిరాక్స్ గెజిటెడ్ అధికారితో ధ్రువీకరణ సంతకంతో పాటు రెండు పాస్పోర్ట్ సైజ్ ఫోటోలను తెచ్చుకోవాలని ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి కే రాము 1:3 నిష్పత్తిలో ఎంపికైన అభ్యర్థులకు సూచించారు. శనివారమే చివరి రోజు అని, తప్పకుండా ధ్రువపత్రాల పరిశీలనకు హాజరు కావాలని, ఎటువంటి మినహాయింపులు ఉండవని తెలిపారు.

## టాస్ అడ్మిషన్ల గడువు పొడగింపు

జనగామ అక్టోబర్ 04 (ప్రజామంటలు):
తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ (టాస్) 2024-25 ఎస్ ఎస్ సి, ఇంటర్మీడియట్ కోర్సులలో అడ్మిషన్ల కోసం దరఖాస్తు చివరి తేదీని ప్రభుత్వం పొడిగించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి కే రాము ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి ఎస్ ఎస్ సి, ఇంటర్మీడియట్ టాస్ కోర్సుల కోసం దరఖాస్తులను ఇప్పుడు 31-10-2024 వరకు సమర్పించవచ్చు. ఆసక్తి గల అభ్యాసకులు https://www.telanganaopenschool.org ద్వారా ఆన్లైన్ దరఖాస్తులను సమర్పించవలసిందిగా అభ్యర్థించబడ్డారు. అభ్యాసకులు దరఖాస్తును ఆన్లైన్లో సమర్పించిన వెంటనే సంబంధిత గుర్తింపు పొందిన సంస్థలకు (పాఠశాలలు/కళాశాలలు) అవసరమైన అన్ని పత్రాలను సమర్పించడం తప్పనిసరి. ఈ దశ వారి అప్లికేషన్ల సాఫీగా ప్రాసెసింగ్ను నిర్ధారిస్తుం దని డిఇఓ తెలిపారు.

## తుది దశ కు చేరుకున్న కుటుంబ డిజిటల్ హెల్త్ కార్డుల సర్వే

### జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా



జనగామ అక్టోబర్ 04 (ప్రజామంటలు):
జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో ఎంపిక చేసిన గ్రామాల్లో పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టిన కుటుంబ డిజిటల్ హెల్త్ కార్డుల సర్వే ప్రక్రియను అధికారులు సమర్థవంతంగా నిర్వరిస్తున్నారని జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. గురువారం, జనగామ మండలంలోని ఎర్రగొల్లపహాడ్ గ్రామ పంచాయతీ పరిధిలో గల పెద్దతండా.వై లో నిర్వహిస్తోన్న డిజిటల్ హెల్త్ కార్డు సర్వేను జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. అక్టోబర్ 3 నుంచి 7 వరకు అయిదు రోజుల పాటు జరిగే ఈ సర్వే ప్రక్రియను క్షేత్రస్థాయిలో అధికారులు ప్రతి ఇంటికి వెళ్లి, ఆయా కుటుంబాల సమగ్ర వివరాలను సేకరించి, సరైన విధంగా నమోదు చేయాలని సూచించగా, అధికారులు సమర్థవంతంగా.... బాధ్యతయుతంగా చేస్తున్నారన్నారు. ఈ సర్వే కోసం క్షేత్రస్థాయిలో నోడల్ అధికారులను, సమన్వయ అధికారులను, వివిధ శాఖల అధికారులతో బృందాలను కలెక్టర్ నియమించామన్నారు. ఈ మేరకు జనగామకు సంబంధించి.. జనగాం మండలంలోని పెద్ద తండా.వై పరిధిలో 138 కుటుంబాలను, మున్సిపాలిటీ పరిధిలోకి వచ్చే 24వ వార్డులోని పాత బీట్ బజారు, కుర్మ వాడ, నాగులకుంట లోని 423 కుటుంబాలను, అలాగే ఘనపూర్ (స్టేషన్) నియోజకవర్గానికి సంబంధించి రఘునాథపల్లి మండలంలోని కన్నాయిపల్లిలో 196, మాధారం గ్రామంలో 178 కుటుంబాలు, అదే విధంగా పాలకుర్తికి సంబంధించి.. పాలకుర్తి మండలంలోని రాఘవాపురం గ్రామంలోని 165 కుటుంబాల్లో సర్వే తుది దశ కు చేరుకుందని కలెక్టర్ తెలిపారు.సర్వే పూర్తయిన తర్వాత.... ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల మేరకు సర్వే వివరాలు నమోదు అయ్యాయా? లేదా? అని ప్రతీ కుటుంబ వివరాలను ఒకటికి రెండు సార్లు చెక్ చేసుకోవాలన్నారు. ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా.... నమోదు వివరాలు పక్కాగా ఉన్న తర్వాత నే పంపించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సర్వేను ఎంత బాధ్యతగా వేగవంతంగా చేస్తున్నారో అదే విధంగా ఎంపిక చేసిన ప్రతీ కుటుంబం వివరాలను కూడా అంతే బాధ్యతగా, పక్కాగా చెక్ చేయాలన్నారు. సర్వే కి సహకరిస్తున్న స్థానిక ప్రజాప్రతినిధులకు, ప్రజలకు కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, జడ్పీ సీఈఓ సరిత, ఎంపీడీఓ సంపత్, సర్వే బృంద సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎల్కతుర్తి మండలం నుండి రైతు రక్షణ సమితి అధ్యక్షులు ఇంగే భాస్కర్



ఎల్కతుర్తి అక్టోబర్ 04 (ప్రజామంటలు):
ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రెండు లక్షల రుణమాఫీ ప్రతి రైతుకు చేయాలని తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షులు వరికెల కిషన్ రావు మరియు హనుమకొండ జిల్లా అధ్యక్షులు హింగే భాస్కర్ రైతుల తరఫున ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సందర్భంగా కిషన్ రావు మాట్లాడుతూ వాన కాలం సీజన్ చివరి దశ చేరిన రైతు భరోసా రాక రైతులు చాలా ఇబ్బంది పడుతున్నారు రైతు ప్రభుత్వం రైతు క్షేమం కోరే ప్రభుత్వం మాటలకే పరిమితం అవుతుంది వెంటనే ప్రభుత్వం స్పందించి రైతుబంధు విడుదల చేయాలని అన్నారు జిల్లా అధ్యక్షులు భాస్కర్ మాట్లాడుతూ.... రుణమాఫీ కాక రైతులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. పంటలకు తెగులు సోకి రైతులకు పెట్టుబడి లేక రైతులు ప్రైవేటు వ్యక్తుల దగ్గర అప్పు తీసుకొని ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి 20 లక్షల రైతులకు ఇలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని అన్నారు.

## రైతురుణమాఫీపై పోరు ఆగదు - కేటీఆర్



హైదరాబాద్, (ప్రజా మంటలు):
సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ట్విటర్ వేదికగా సంచలన వ్యాఖ్యలు చేశారు. 20 లక్షల మందికి రుణమాఫీ అందలేదని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించడంతో సీఎం బండారం మరోసారి బట్టబయలైందని కేటీఆర్ అన్నారు. 100% రుణమాఫీ పూర్తి చేశామన్న ముఖ్యమంత్రి డొల్లమాటలే అని మరోసారి తేలిపోయిందన్నారు. 2 లక్షల రుణమాఫీ పూర్తి చేశామన్న సన్నాసి మాటలు మోసం తప్ప మరొకటి కాదా అని ప్రశ్నించారు. రాబందు ప్రభుత్వం ఉంటే రైతులకు ఎలాంటి ప్రయోజనం లేదని, రేవంత్ అసమర్థత ధాన్యం దాతలకు కోలుకోలేని శాపమని కేటీఆర్ ట్వీట్ చేశారు. ఒకవైపు డిసెంబర్ 9న ఏకకాలంలో చేస్తామని మాయమాటలు చెప్పి.. మరోవైపు 10 నెలల తర్వాత కూడా 20 లక్షల మందిని మోసం చేశారని మండిపడ్డారు. 2 లక్షల రుణమాఫీ పూర్తయిపోయిందన్న సన్నాసి మాటలు నయవంచన కాక మరేంటి ?? అని ప్రశ్నించారు. అధికారిక లెక్కల ప్రకారమే.. 20 లక్షల అన్నదాతలకు అన్యాయం జరిగితే అనధికారికంగా రుణమాఫీ కాని రైతులందరో ?? అని ట్విటర్ వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశారు. చేస్తామన్న రుణమాఫీ ఇప్పటికీ పూర్తి చేయలేదు.. ఇవ్వాల్సిన రైతుబంధు సీజన్ ముగిసినా ఇయ్యలేదన్నారు. రాబందుల ప్రభుత్వం ఉండి రైతులకు ఏం లాభం రేవంత్ చేతకానితనం.. అన్నదాతలకు కోలుకోని శాపం అని ట్విటర్ వేదికగా సీఎం పై మండిపడ్డారు.

## పాకిస్థాన్ పర్యటనకు జైశంకర్

దిల్లీ (ప్రజా మంటలు): కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జైశంకర్ పాకిస్థాన్ పర్యటనకు వెళ్లనున్నారు. అక్టోబర్ 15-16 తేదీల్లో ఇస్లామబాద్ వేదికగా జరగనున్న వార్షిక షాంఘై సహకార సంఘం సమావేశానికి ఆయన హాజరుకానున్నారు. ఈ విషయాన్ని భారత విదేశాంగ మంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి రణ్ధీర్ జైశ్వాల్ వెల్లడించారు. ఈసారి ఎస్సీవో సదస్సుకు ఆతిథ్యం ఇస్తోన్న పాకిస్థాన్ నుంచి ఆహ్వానం అందినట్లు ఆగస్టు 30న కేంద్రం ధ్రువీకరించింది.

ఈ శిఖరాగ్ర సమావేశంలో ూఅూ సభ్య దేశాలకు చెందిన ప్రతినిధులు ఆయా దేశాల మధ్య ఆర్థిక, సామాజిక-సాంస్కృతిక, మానవతా సహకారంపై దృష్టి సారించనున్నారు. దీంతో పాటు పలు రౌండ్లలో సీనియర్ అధికారుల సమావేశాలూ జరగనున్నాయి.షాంఘైలో 2001లో జరిగిన శిఖరాగ్ర సదస్సులో ఎస్సీవో ఏర్పాటైంది. తొలుత ఇందులో రష్యా, చైనా, కిర్గిజ్ రిపబ్లిక్, కజికిస్థాన్, తజికిస్థాన్, ఉజ్బెకిస్థాన్లు ఉండగా.. 2017లో భారత్, పాకిస్థాన్లు శాశ్వత సభ్యత్వం పొందాయి. గతేడాది భారత్ ఆతిథ్యంలో వర్చువల్గా జరిగిన ఈ సదస్సు సందర్భంగా ఇరాన్ శాశ్వత సభ్య దేశంగా చేరింది.

## బైకుల దొంగగా మారిన మాజీ హోంగార్డు దవాఖానలు, వైన్షాపులే టార్గెట్

### రూ. 5 లక్షల విలువ చేసే 8 బైకుల స్వాధీనం

సికింద్రాబాద్ అక్టోబర్ 04 (ప్రజామంటలు):
గతంలో డీజీపీ ఆఫీస్ లో హోంగార్డుగా పనిచేసిన ఓ హోంగార్డు, ఫేక్ ధృవపత్రాల కేసులో ఉద్యోగం పోయాక దొంగగా మారి, చివరికి పోలీసులకు చిక్కాడు. ఈస్ట్ జోన్ అడిషనల్ డీసీపీ నర్సయ్య శుక్రవారం చిలకలగూడ ఠాణలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. బన్సీలాల్ పేట డివిజన్ బోయిగూడ కు చెందిన అబ్రహం జానీ (48) 1996 లో పోలీస్ శాఖలో హోంగార్డుగా చేరాడు. యాంటీ హైజాకింగ్, డీజీపీ ఆఫీసులో డ్రైవర్ గా పనిచేశాడు. ఫేక్ ధృవపత్రాలతో హోంగార్డు ఉద్యోగాల్లో చేరారన్న ఆరోపణలపై 2015లో ప్రభుత్వం పలువురిని ఉద్యోగాల్లో నుంచి తొలగించింది. ఇందులో అబ్రహం జానీ ఒకరు. జాబ్ పోయిన తర్వాత జానీ మారుతీ షోరూమ్ సర్వీస్ స్టేషన్ లో పనిచేశారు. డయాబెటిక్ తో ఆ జాబ్ కూడ వదిలేసి గంజాయి,మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో డబ్బుల కోసం బైక్ ల దొంగతనానికి శ్రీకారం చుట్టాడు. దవఖానలు, వైన్ షాపులే టార్గెట్ గా మొత్తం రూ 5లక్షల విలువ చేసే 8 బైకులను దొంగతనం చేసి పార్శీగుట్ట శ్రీనివాస్ నగర్ కు చెందిన రావుల ఆంజనేయులుకు విక్రయించాడు. గాంధీ ఆసుపత్రిలో నాలుగు, పాత గాంధీ వద్ద, హెబ్రోన్ చర్చి, ఎస్ఎన్ఎస్ఎల్ వైన్స్, దుర్గా వైన్స్ వద్ద ఒక్కొక్కటి బైకులు చోరి చేశారు. పోలీసులు వల పన్ని ప్రధాన నిందితుడు అబ్రహాం జానీ తో పాటు బైక్ లను కొనుగోలు



చేసిన ఆంజనేయులును అరెస్ట్ చేశారు. వీరివద్ద నుంచి 8 బైకులను రికవరీ చేశారు. వరస బైకుల దొంతనం కేసును ఛాలెంజ్గా తీసుకొని చేధించిన పోలీసులను అడిషనల్ డీసీపీ నర్సయ్య అభినందించి, వారికి క్యాష్ రివార్డులను అందచేశారు. సమావేశంలో ఏసీపీ జైపాల్ రెడ్డి, సీఐ అనుదీప్, డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ రమేశ్ గౌడ్, ఎస్.ఐ ఆంజేయులు, కానిస్టేబుళ్ళు నవీన్, జగదీష్, షేక్ మదర్ బాషా, గణేశ్, వినయ్, కృష్ణ, నరేశ్ పాల్గొన్నారు.

DIGITALLY PRINTED AND PUBLISHED BY CH.V. PRABHAKAR RAO AT 6-3-144, bRAHMAN WADA, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL 2021/81092
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com